విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999



# చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక


## చంద్రబాబు రెండ్రోజుల పర్యటన షెడ్యూల్ ఖరారు!



(చట్టం న్యూస్ ) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 19, 20 తేదీల్లో రాష్ట్రంలోని రెండు కీలక జిల్లాల్లో పర్యటించేందుకు అధికారిక షెడ్యూల్ ఖరారైంది. మొదటగా ఈ నెల 19వ తేదీన నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట గ్రామానికి సీఎం చేరుకుంటారు. అక్కడ సముద్రతీర ప్రాంత మత్స్యకారుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం తలపెట్టిన 'మత్స్యకార సేవా' ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా

మిగతా 2వ పేజీలో..

సంపుటి : 14 ● సంచిక : 124 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi సోమవారం 18 మే 2026 ● పేజీలు : 8 ● వెల 2/-

## ఎబోలాతో 88 మంది మృతి..

### గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన WHO



ఆఫ్రికా దేశాలైన కాంగో, ఉగాండాల్లో ఎబోలా వైరస్ మహమ్మారి విలయతాండవం చేస్తోంది. గత కొద్ది రోజులుగా ఇక్కడ వైరస్ వ్యాప్తి రేటు అసాధారణంగా పెరగడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటివరకు 300కు పైగా అనుమానిత కేసులు నమోదు కాగా, అందులో 88 మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రపంచవ్యాప్తంగా అప్రమత్తత అవసరమని గుర్తిస్తూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ పరిస్థితిని "పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్" (అంతర్జాతీయ ప్రాధాన్యత గల ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి) గా ప్రకటించింది.

**రంగంలోకి అంతర్జాతీయ వైద్య బృందాలు**

ఈ ప్రత్యేక ప్రకటన ద్వారా ఎబోలా ప్రభావిత ప్రాంతాలకు గ్లోబల్ లెవెల్‌లో తక్షణ సహాయం అందే మార్గం సుగమమైంది. వైరస్ నిర్మూలనకు అవసరమైన నిధులు,

మిగతా 2వ పేజీలో..

# ఆర్థిక కార్యాచరణ అత్యవసరం !

(చట్టం న్యూస్ ) :నాలుగు రాష్ట్రాలఅసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్‌లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్దంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్థ రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు. హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి




విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్ముజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా

మిగతా 2వ పేజీలో..

# రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం

(చట్టం న్యూస్ ) :తిరువనంతపురం సెంట్రల్ నుండి ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ వెళ్తున్న ప్రతిష్టాత్మక రాజధాని ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 12431) లో శనివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శుక్రవారం సాయంత్రం బయలుదేరిన ఈ రైలు, శనివారం మధ్యాహ్నానికి ఢిల్లీ చేరుకోవాల్సి ఉండగా.. మార్గమధ్యలో రాజస్థాన్‌లోని కోటా సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో రైలులోని బీ1 (డీ1) ఏసీ కోచ్‌తో పాటు ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే, రైల్వే సిబ్బంది, ప్రయాణికులు సమయస్ఫూర్తితో వ్యవహరించడం, మంటలను ముందుగానే గుర్తించడంతో ఒక భారీ ప్రాణనష్టం మరియు ఘోర రైలు ప్రమాదం తృటిలో తప్పింది.

**అప్రమత్తం చేసిన ఆటోమేటెడ్ హూటర్.. 15 నిమిషాల్లో ఖాళీ!**

ఈ ప్రమాదం జరిగిన సమయంలో సదరు కోచ్‌లో 68 మంది ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్నారు. అయితే, కోటా స్టేషన్‌లో అమర్చిన అత్యాధునిక 'ఆటోమేటెడ్ హూటర్' సిస్టమ్ ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి మోగడంతో రైల్వే



యంత్రాంగం తక్షణమే అప్రమత్తమైంది. రైలును వెంటనే నిలిపివేసి, కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే ప్రభావిత బోగీలోని ప్రయాణికులందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. భద్రతా చర్యల్లో భాగంగా ఓవర్‌హెడ్ ఎలక్ట్రిక్ విద్యుత్ సరఫరాను నిలిపివేసి, మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా ప్రమాదానికి గురైన

మిగతా 2వ పేజీలో..

## పెట్రోల్ బంక్‌ల టైమింగ్ విషయంలో కొత్త ప్రతిపాదన

(చట్టం న్యూస్ ) :ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్ బంకుల పనివేళల మార్పునకు సంబంధించి ఒక కీలకమైన ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దేశంలో ఇంధన పొదుపును ప్రోత్సహించాలన్న ప్రధానమంత్రి పిలుపునకు మద్దతుగా.. రాష్ట్రంలో పెట్రోల్ బంకుల సమయాన్ని పరిమితం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెట్రోలియం ఫెడరేషన్ ప్రతిపాదించింది. ఇకపై ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే పెట్రోల్ బంకులను



నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు ఫెడరేషన్ ఒక వినతిపత్రాన్ని సమర్పించింది. రాత్రి వేళల్లో బంకుల నిర్వహణను తగ్గించడం ద్వారా ఇంధనంతో పాటు ఇతర వనరులను కూడా ఆదా చేయవచ్చని ఫెడరేషన్ భావిస్తోంది.

**వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రభావం.. విద్యుత్ పొదుపే లక్ష్యం!**

మారుతున్న ఆధునిక కాలంలో ఐటీ మరియు ఇతర సేవా రంగాలలో వర్క్ ఫ్రమ్ హోమ్ (ఔశీతీꙆ ఖీతీశీఎ Ꙇశీఎవ) సంస్కృతి, అలాగే కార్పొరేట్ సంస్థల్లో వర్చువల్ మీటింగ్‌లు (ఆన్‌లైన్ సమావేశాలు) విపరీతంగా పెరిగిపోయాయి. దీనివల్ల గతంతో పోలిస్తే రాత్రి

మిగతా 2వ పేజీలో..

## ఒకే టికెట్‌పై 3 రోజుల్లో 4 సార్లు దైవదర్శనం!




(చట్టం న్యూస్ ) :కలియుగ వైకుంఠమైన తిరుమలలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సరికొత్త ఆధ్యాత్మిక ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది. ఆగస్టు 23 నుండి 25వ తేదీ వరకు ఆలయంలో అత్యంత వైభవంగా జరగనున్న వార్షిక పవిత్రోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఒకే టికెట్‌పై వరుసగా మూడు రోజుల పాటు నాలుగు సార్లు శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకునే అద్భుత అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ పవిత్రోత్సవాల

మిగతా 2వ పేజీలో..

## భగీరథ్‌కు 14 రోజుల రిమాండ్..చర్లపల్లి జైలుకు తరలింపు



(చట్టం న్యూస్ ) :రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌కు మేడ్చల్ కోర్టు ఈనెల 29 వరకు 14 రోజుల పాటు జుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు.. అంతకుముందు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌ను సుమారు రెండున్నర గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు. విచారణ అనంతరం నిందితుడికి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, భారీ భద్రత నడుమ మేడ్చల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కేసు డైరీని, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయమూర్తి రిమాండ్ ఉత్తర్వులు జారీ

మిగతా 2వ పేజీలో..

# మోదీ నెదర్లాండ్స్ పర్యటనలో..కుదిరిన కీలక డీల్

(చట్టం న్యూస్ ) :ప్రధాని నరేంద్ర మోదీ నెదర్లాండ్స్ పర్యటన భారతదేశ పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో ఒక సరికొత్త అధ్యాయానికి తెరలేపింది. ఈ పర్యటనలో భాగంగా భారత్‌లో సరికొత్త సెమీకండక్టర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి ఒక చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ పరికరాల తయారీలో అగ్రగామిగా ఉన్న డచ్ సంస్థ ఞూమీ, భారతీయ దిగ్గజం టాటా ఎలక్ట్రానిక్స్ పరస్పరం చేతులు కలిపాయి. ఈ రెండు సంస్థల భాగస్వామ్యంతో గుజరాత్‌లోని ధోలెరాలో అత్యాధునిక చిప్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. గ్లోబల్ సెమీకండక్టర్ హబ్‌గా ఎదగాలనే ఆకాంక్షకు ఈ డీల్ ఒక బలమైన ఊతాన్ని ఇవ్వనుంది.



**దేశంలోనే తొలి 300ఎఎ కమర్షియల్ ఫ్యాక్టరీ.. రూ. లక్ష కోట్ల పెట్టుబడి!**

ఈ ఒప్పందం ప్రకారం, గుజరాత్‌లో నిర్మించబోయే ప్లాంట్ దేశంలోనే మొట్టమొదటి 300ఎఎ (12 ఇంచుల) సెమీకండక్టర్ కమర్షియల్ ఫ్యాక్టరీగా రికార్డు సృష్టించనుంది. ఇంతటి భారీ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రాజెక్ట్ కోసం టాటా గ్రూప్ దాదాపు రూ. 1,00,000 కోట్లను (లక్ష కోట్లు) పెట్టుబడిగా పెట్టేందుకు సిద్ధమైంది. ఞూమీ అందించే ప్రపంచ స్థాయి లితోగ్రఫీ సాంకేతికత, టాటా సంస్థకు ఉన్న పారిశ్రామిక నైపుణ్యం కలిసి భారతదేశంలోనే అత్యంత అధునాతన చిప్‌ల ఉత్పత్తికి మార్గం సుగమం చేయనున్నాయి. ఈ భారీ పెట్టుబడి ద్వారా దేశీయంగా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, విదేశీ దిగుమతులపై మన

మిగతా 2వ పేజీలో..

## ఆర్టీసీ విలీనంపై సర్కార్ కసరత్తు

(చట్టం న్యూస్ ) :తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును తీవ్రతరం చేసింది. ఆర్టీసీ కార్మికులు సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న ప్రధాన డిమాండ్ ఇదే కావడంతో, ముఖ్యమంత్రి నేతృత్వంలోని యంత్రాంగం ఈ దిశగా చురుగ్గా అడుగులు వేస్తోంది. రాబోయే రాష్ట్రావతరణ రోజైన జూన్ 2వ తేదీన ఈ విలీన ప్రక్రియపై అధికారికంగా

మిగతా 2వ పేజీలో..




## జడ్జీల పెంపునకు రాష్ట్రపతి ఆమోదం



(చట్టం న్యూస్ ) :దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల ఒత్తిడిని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలకమైన అడుగు వేసింది. ప్రస్తుతం కోర్టులో సుమారు 96 వేల కేసులు పెండింగ్‌లో ఉండటంతో, న్యాయ ప్రక్రియ తీవ్రంగా ఆలస్యమవుతోంది. ఈ గడ్డు పరిస్థితిని అధిగమించడానికి, సుప్రీంకోర్టులో ఉన్న న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి (ప్రధాన న్యాయమూర్తితో కలిపి) పెంచుతూ కేంద్రం ఒక ఆర్డినెన్స్‌ను రూపకల్పన చేసింది. ఈ ఆర్డినెన్స్‌కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారికంగా ఆమోదముద్ర వేశారు.

**:96 వేల పెండింగ్ కేసుల నేపథ్యంలో కీలక నిర్ణయం**

రాష్ట్రపతి ఆమోదంతో ఈ

మిగతా 2వ పేజీలో..

## భగీరథ్‌కు 14 రోజుల రిమాండ్..చర్లపల్లి జైలుకు తరలింపు

మొదటి పేజి తరువాయి..

చేయడంతో, పోలీసులు అతడిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.

**స్వచ్ఛందంగానే పోలీసులకు అప్పగించామన్న లాయర్!**

ఈ అరెస్ట్ వ్యవహారంలో పలు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. బండి భగీరథ్ తరఫు న్యాయవాది కరుణాసాగర్ కోర్టు పరిసరాల్లో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము చట్టాన్ని గౌరవిస్తామని, అందుకే భగీరథ్‌ను స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించామని ఆయన వెల్లడించారు. నిందితుడు ఎక్కడికీ పారిపోలేదని, పోలీసుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాడని స్పష్టం చేశారు. రాజకీయ లేదా ఇతర కారణాల వల్ల ఈ కేసులో ఏవైనా కోణాలు ఉన్నాయా అనేది విచారణలో తేలుతుందని, తమ క్లయింట్ నిర్దోషిగా బయటకు వస్తాడనే నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు.

**చర్లపల్లి జైల్లో భారీ బందోబస్తు**

కోర్టు రిమాండ్ విధించిన వెంటనే పోలీసులు ఎలాంటి ఆలస్యం చేయకుండా భగీరథ్‌ను చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు జైలు పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా, పోక్సో చట్టం కింద నమోదైన కేసు కావడంతో సిట్ అధికారులు మరింత లోతుగా ఆధారాలను సేకరిస్తున్నారు. విచారణలో భగీరథ్ చెప్పిన వివరాలను, బాధితుల స్టేట్‌మెంట్లను సరిపోల్చే పనిలో పడ్డారు. రాబోయే రోజుల్లో కేసు తీవ్రతను బట్టి నిందితుడిని మరింత సమాచారం కోసం పోలీస్ కస్టడీకి కోరే అవకాశం కూడా ఉందని లీగల్ వర్గాలు భావిస్తున్నాయి.

## చంద్రబాబు రెండ్రోజుల పర్యటన షెడ్యూల్ ఖరారు!

మొదటి పేజి తరువాయి..

పాల్గొని, మత్స్యకార సమాజానికి చేకూరే వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.

అనంతరం, మరుసటి రోజు అనగా 20వ తేదీన ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటించనున్నారు. కుప్పం ప్రజల ఆరాధ్యదైవమైన ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవస్థానాన్ని సీఎం దర్శించుకోనున్నారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం గంగమ్మ తల్లికి ముఖ్యమంత్రి హోదాలో పట్టువస్త్రాలు సమర్పించి, రాష్ట్ర ప్రజల శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకుని ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు ప్రోటోకాల్ మరియు భద్రతాపరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు.

## ఎబోలాతో 88 మంది మృతి..

మొదటి పేజి తరువాయి..

అత్యవసర వ్యాక్సిన్లు మరియు అంతర్జాతీయ వైద్య నిపుణుల సేవలు బాధిత దేశాలకు వేగంగా చేరనున్నాయి. అయితే, ఎబోలా అత్యంత వేగంగా సంక్రమించే వ్యాధి కావడంతో, అంతర్జాతీయ సరిహద్దుల గుండా ఇది ఇతర దేశాలకు పాకకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులపై కఠిన నిఘా ఉంచాలని ఆరోగ్య రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం

మొదటి పేజి తరువాయి..

కోచ్‌ను రైలు నుండి వేరు చేశారు. ముందుజాగ్రత్తగా పక్కనే ఉన్న మిగతా బోగీలను కూడా ఖాళీ చేయించారు.

**రంగంలోకి ఉన్నతాధికారులు.. వరుస ఘటనలపై ప్రయాణికుల ఆందోళన!**

ప్రమాద సమాచారం అందిన వెంటనే కోటా డివిజినల్ రైల్వే మేనేజర్ అనిల్ కల్రా సహా సీనియర్ రైల్వే అధికారులు, రెస్క్యూ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు, షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే, గత మూడు రోజుల వ్యవధిలోనే రైల్వేలో ఇది రెండో అగ్నిప్రమాదం కావడం గమనార్హం. మే 15న హైదరాబాద్‌లోని నాంపల్లి స్టేషన్‌లో జైపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఏసీ బోగీల్లో మంటలు చెలరేగిన ఘటన మరవకముందే, ఇప్పుడు రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఇలా జరగడం ప్రయాణికుల్లో రైల్వే భద్రతపై కొంత ఆందోళన రేకెత్తిస్తోంది.

## పెట్రోల్ బంక్‌ల టైమింగ్ విషయంలో కొత్త ప్రతిపాదన

మొదటి పేజి తరువాయి..

వేళల్లో ప్రజల రాకపోకలు మరియు వాహనాల సంచారం గణనీయంగా తగ్గిందని పెట్రోలియం ఫెడరేషన్ తన ప్రతిపాదనలో పేర్కొంది. రాత్రి 10 గంటల తర్వాత వాహనాల రద్దీ లేకపోయినప్పటికీ బంకులను తెరచి ఉంచడం వల్ల రిటైల్ అవుట్‌లెట్లలో భారీగా విద్యుత్ వృధా అవుతోందని, కొత్త టైమింగ్స్ అమల్లోకి వస్తే పెద్ద ఎత్తున విద్యుత్ ఆదా అవుతుందని ఫెడరేషన్ స్పష్టం చేసింది.

**అత్యవసర సేవలకు మినహాయింపు.. ఇబ్బంది లేకుండా ప్లాన్!**

ఈ కొత్త ప్రతిపాదన వల్ల సాధారణ ప్రజలకు లేదా అత్యవసర సేవల వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ చర్యలు కూడా సూచించారు. ప్రభుత్వ వాహనాలకు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక శకటాలు వంటి అత్యవసర సేవల వాహనాలకు మరియు నిత్యావసర వస్తువులను రవాణా చేసే లారీలకు అన్ని వేళల్లోనూ ఇంధన సరఫరా అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఫెడరేషన్ తెలిపింది. పౌరసరఫరాల శాఖ గనుక ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే, ఏపీలో పెట్రోల్ బంకుల నిర్వహణలో ఒక సరికొత్త మార్పు రానుంది.

## ఆర్టీసీ విలీనంపై సర్కార్ కసరత్తు

మొదటి పేజి తరువాయి..

కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సచివాలయ వర్గాల సమాచారం. స్వరాష్ట్ర వేడుకల వేళ కార్మికులకు ఇదొక పెద్ద కానుకగా మారబోతోంది.

**ఇతర రాష్ట్రాల అధ్యయనం -- ప్రభుత్వానికి నివేదిక**

ఈ విలీన ప్రక్రియను చట్టపరంగా, పరిపాలనాపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయడానికి ప్రభుత్వం గతంలోనే ఉన్నతాధికారుల కమిటీని నియమించింది. ఈ నేపథ్యంలో అధికారుల బృందం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ (ఇూా) సహా పలు ఇతర రాష్ట్రాల్లో పర్యటించి, అక్కడ ఆర్టీసీని ప్రభుత్వంలో ఎలా విలీనం చేశారు, తలెత్తిన సవాళ్లు ఏమిటి అనే అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. పొరుగు రాష్ట్రాల విధానాలను పరిశీలించిన అనంతరం, తెలంగాణకు అనుకూలంగా ఉండేలా రూపొందించిన సమగ్ర నివేదికను అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగానే ప్రస్తుతం విలీన విధివిధానాల రూపకల్పన జరుగుతోంది.

**37 వేల మందికి పైగా లబ్ధి.. బడ్జెట్‌పై అదనపు భారం**

ఈ చారిత్రాత్మక నిర్ణయం ద్వారా సంస్థలో పనిచేస్తున్న సుమారు 37,360 మంది ఆర్టీసీ కార్మికులు నేరుగా ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు. దీనివల్ల వారి ఉద్యోగాలకు పూర్తి భద్రత లభించడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ఇతర సదుపాయాలు అందే అవకాశం ఉంటుంది. అయితే, ఈ విలీనం వల్ల ప్రభుత్వ ఖజానాపై భారీగా ఆర్థిక భారం పడనుంది. ఆర్టీసీ ఉద్యోగుల జీతభత్యాల రూపంలో ప్రభుత్వంపై ఏటా రూ. 1,000 కోట్లకు పైగా అదనపు ఆర్థిక భారం పడవచ్చని ఆర్థిక శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. భారం ఎక్కువైనా, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వం ఈ ముందడుగు వేస్తుండటం గమనార్హం.

# ఆర్థిక కార్యాచరణ అత్యవసరం !

మొదటి పేజి తరువాయి..

పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యావసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతునున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అనినింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణ మవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబిం చాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకు పోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యలను తక్షణం అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి నిర్ణయాలు అవసరం. ఆర్థిక నిపుణులతో చర్చించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు తలపండిన ఆర్థికవేత్త నేతృత్వంలో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా గ్రామాల నుంచి పట్టణాల వరకు నిరంతరంగా అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించాలి. మన దేశ వనరులు, వినియోగం, దిగుమతులను విశ్లేషించాలి. ఎక్కడ ఖర్చులు తగ్గించవచ్చో అన్నది ప్రజలతో పాటు, మేధావుల నుంచి సూచనలు స్వీకరించాలి. అప్పుడే మనకు ఒక పరిష్కారం దొరుకుతుంది. అంతే తప్ప కాన్వాయ్‌లలో ఒకటి రెండు కార్లను తగ్గించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ చక్కబడదని ప్రధాని మోడీ త్వరగా గుర్తిస్తే మంచిది.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలి






### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక-విద్యా వారోత్సవాలు ఘనంగా ముగింపు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 17 ,(చట్టం బ్యూరో) :** శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి) కరీంనగర్. శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి) కరీంనగర్ ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ముగింపు సమావేశం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కరీంనగర్ 22 వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి గారు మాట్లాడుతూ ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని జీవితంలో సుఖంగా ఉంటారని నలుగురికి ఉపయోగపడేలా సమాజం గర్వించే విధంగా ఎదుగుతారని అలా ఈ కళాశాల విద్యార్థులు ఉండాలని ఈ కళాశాలలో చదువుకోవడం అదృష్టమని ఆ అదృష్టం మీకందరికీ కలగడం సంతోషదాయకమని వివరించారు.ఐక్యూఏసి కో ఆర్డినేటర్ డాక్టర్ హర్జోత్ కౌర్ ఈ వారం రోజులు కళాశాలలో జరిగిన కార్యక్రమాల నివేదికను చదివి వినిపించారు అకాడమిక్ ఎక్సెలెన్స్ సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తూ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్ మాట్లాడుతూ లక్ష్యం ఉన్నతమైతే జీవితం లక్షణంగా ఉంటుందని ఆ దిశగా విద్యార్థులందరూ ప్రయత్నం చేయాలని చదువునెప్పుడు మానకూడదు అని విద్యార్థులందరూ ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు మరొక వైస్ ప్రిన్సిపల్ టి రాజయ్య మాట్లాడుతూ అకాడమిక్ ఎక్సెలెన్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావం పెంపొందాలని దానికి ఎన్ఎస్ఎస్ ఎన్సీసీ లాంటివి ఉపయోగ పడతాయని ఆ దిశగా విద్యార్థులు ప్రయత్నం చేసి జీవితంలో సఫలం కావాలని ఆకాంక్షించారు .కళాశాల ఎన్ సిసి అధికారి మేజర్ రేళ్ల సంజీవ్ మాట్లాడుతూ ఈ కళాశాల ఎన్ సి సి విద్యార్థుల సేవా కార్యక్రమాల్లో ముందున్నదని అది విద్యార్థుల భావి జీవితానికి బాటలు వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పోషకులు కళాశాలలో చదువుకున్న తమ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో వెళ్లేలా కళాశాల ప్రోత్సహిస్తుందని తెలిపారు. వికసిత్భారత్ జాతీయస్థాయిలో పాల్గొన్న విద్యార్థి శ్రీ నిత్య మాట్లాడుతూ తనకు ఈ కళాశాల ప్రోత్సాహం ఇచ్చిందని అందుకు రుణపడి ఉంటారని తెలిపింది

ఈ కార్యక్రమంలో ,స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ టి శ్రీనివాస్ ,డాక్టర్ మల్లారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్లు అర్జున్ పడాల తిరుపతి రాజేందర్ వెంకటేశ్వర్లు తదితర అధ్యాపకులు బోధనేతర సిబ్బంది , పాత్రికేయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువజన, క్రీడా వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/మే 17 ,(చట్టం బ్యూరో) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఈ నెల 18 వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా 18వ తేదీన సోమవారం జిల్లాస్థాయిలో ఉదయం ఏడు గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ ప్రోగ్రాం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఏ రాందాసు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. వివిధ పాఠశాలల, కళాశాలల బాల బాలికలు, యువత, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ కోచ్ లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, క్రీడా అసోసియేషన్ సభ్యులు, ప్రెసిడెంట్లు తరలివచ్చి విజయవంతం చేయాలని రాందాస్ కోరారు. అలాగే ఈ నెల 23వ తేదీన సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో నిర్వహింకానున్న జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరించారు.

## గూగూడు జంట దేవాలయాలను దర్శించుకున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి కవిత, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ...





**నార్పల మే 17, (చట్టం) న్యూస్ :** నార్పల మండలం గూగుడు గ్రామంలోని కుల్లాయి స్వామి, ఆంజనేయస్వామి జంట దేవాలయాలను మంత్రి సవిత, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, జిల్లా టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ నార్పల మండల అభివృద్ధికి సంబంధించి మంత్రి సవితకు పలు వినతిపత్రాలను అందజేశారు. ముఖ్యంగా గురుకుల పాఠశాల,బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, అలాగే ధోబీ ఘాట్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని మంత్రి సవితను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కోరారు. మంత్రి సవిత వినతులపై సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే శింగనమల నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బండ్లపల్లి కుల్లాయప్ప, గూగుడు జాఫర్, రాజన్న, నాగార్జున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీరవెల్లి నర్సింగరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్

**బోయిన్ పల్లి మండలం / మే 17 ,(చట్టం బ్యూరో) :** బోయినపల్లి మండల స్థబంపల్లి గ్రామనికి చెందిన బీరవెల్లి నర్సింగరావు గత మూడు రోజుల క్రితం అనారోగ్య కారణాలతో చనిపోగా వారి కుటుంబ సభ్యులను భీరవెల్లి వెంకటేశ్వరావు, సాగర్ రావు గారిని స్థానిక నేతలలో కలిసి పరామర్శించారు.తనతోపాటు మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుంటి శంకర్ , చింతపల్లి వెంకట రెడ్డి, బోయిని రాజు, చెన్నాడి వెంకటేశ్వరరావు, అక్కెనపల్లి కరుణాకర్,బత్తిని కమల్ గౌడ్, బాపు రెడ్డి, ముత్యపు ఎల్లయ్య, అక్కెనపల్లి మధుకర్, కోడూరి చందు, రాజిరెడ్డి, విజయ్, మోహన్ దాస్, కార్తీక్, రమేష్, శ్రీనివాస్ ,సృజన్,తదితరులు పాల్గొన్నారు.



## ఒకే టికెట్‌పై 3 రోజుల్లో 4 సార్లు దైవదర్శనం!

మొదటి పేజి తరువాయి..

ప్రత్యేక సేవా టికెట్లను ఈనెల మే 21వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు

ఈ ప్రత్యేక టికెట్ ధరను రూ. 5,000 గా నిర్ణయించారు. ఈ ఒక్క టికెట్‌పై దంపతులు లేదా ఇద్దరు భక్తులు ఆలయంలోకి ప్రవేశించవచ్చు. టికెట్ పొందిన భక్తులకు కేవలం దర్శనమే కాకుండా, ఉత్సవాల రోజుల్లో ఉదయం వేళల్లో జరిగే కన్నులపండువైన 'స్నపన తిరుమంజనం' (అభిషేకం) సేవలో మరియు చివరి రోజు నిర్వహించే 'పూర్ణాహుతి' క్రతువులో నేరుగా పాల్గొనే అరుదైన భాగ్యం లభిస్తుంది. ఈ సేవలకు హాజరయ్యే భక్తులు ఉదయం 7 గంటలకల్లా సాంప్రదాయ దుస్తులలో, ఒరిజినల్ ఫోటో ఐడీ కార్డుతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 కు చేరుకోవాలని టీటీడీ సూచించింది. ఆలయంలో ఏడాది పొడవునా తెలిసీ తెలియక జరిగే దోషాల నివారణార్థం నిర్వహించే ఈ పవిత్రోత్సవ టికెట్లను భక్తులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని అధికారులు కోరారు.

## మోదీ నెదర్లాండ్స్ పర్యటనలో.. కుదిరిన కీలక డీల్

మొదటి పేజి తరువాయి..

దేశం ఆధారపడటం గణనీయంగా తగ్గుతుంది.

**ఆటోమొబైల్, ఏఐ రంగాలకు బూస్ట్.. డిజిటల్ భారత్‌కు సరికొత్త దిశ!**

ధోలెరాలో ఏర్పాటు కానున్న ఈ ప్లాంట్ భవిష్యత్తు సాంకేతిక అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించనుంది. ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , స్మార్ట్‌ఫోన్లు, నెక్స్ట్ జనరేషన్ ఆటోమొబైల్స్ (ఎలక్ట్రిక్ వాహనాలు), రక్షణ రంగాలకు అవసరమైన హై-ఎండ్ చిప్‌లను ఈ ఫ్యాక్టరీలో తయారు చేస్తారు. దీనివల్ల గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్ ఒక నమ్మకమైన భాగస్వామిగా మారుతుంది. ప్రధాని మోదీ దౌత్య విజయం, టాటా గ్రూప్ సాహసోపేత నిర్ణయం వెరసి, 'మేక్ ఇన్ ఇండియా' పారిశ్రామిక స్వప్నాన్ని నిజం చేస్తూ రాబోయే రోజుల్లో దేశాన్ని సెమీకండక్టర్ రంగంలో సూపర్ పవర్‌గా నిలబెట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

## జడ్జీల పెంపునకు రాష్ట్రపతి ఆమోదం

మొదటి పేజి తరువాయి..

నిర్ణయం తక్షణమే అమలులోకి రానుంది. న్యాయమూర్తుల సంఖ్య పెరగడం ద్వారా కొత్త బెంచ్‌లు ఏర్పాటవుతాయని, తద్వారా చాన్నాళ్లుగా నలుగుతున్న కీలక కేసులు మరియు అప్పీళ్లు వేగంగా కొలిక్కి వస్తాయని భావిస్తున్నారు. ఈ భౌగోళిక మార్పు న్యాయవ్యవస్థపై ఉన్న అపారమైన భారాన్ని తగ్గించడమే కాకుండా, పౌరులకు సకాలంలో న్యాయం అందేలా చేయడంలో కీలక పాత్ర పోషించనుంది.

# జవహర్ నగర్ 2బిహెచ్‌కే ఫేజ్-3లో నీటి సమస్య తీవ్రం..

**బ్లాక్ అధ్యక్షుడు సుధాకర్ నాయక్ ఆవేదన....**

**జవహర్ నగర్,17 మే (చట్టం) :** జవహర్ నగర్ 2బిహెచ్‌కే ఫేజ్-3 కాలనీలో గత 15 రోజులుగా తీవ్ర నీటి సమస్య నెలకొనడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బ్లాక్ అధ్యక్షుడు సుధాకర్ నాయక్ తెలిపారు. తాగునీటి కొరతతో పాటు ఎస్టీపీ పంప్ హౌస్ సమస్యలు, పారిశుధ్య లోపాలు కాలనీవాసులను వేధిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని ఆరోపించారు. గత వారం రోజులుగా ప్రతి బ్లాక్‌కు రోజుకు రెండు నీటి ట్యాంకర్లు తెప్పిస్తున్నప్పటికీ అవి సరిపోవడం లేదన్నారు. తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

"ప్రభుత్వం పేరుకే ఇండ్లు కేటాయించింది కానీ ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌ల కంటే ఎక్కువగా ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నాం.






అయినప్పటికీ ప్రభుత్వం గానీ అధికారులు గానీ కనీస సహకారం అందించడం లేదు" అని సుధాకర్ నాయక్ విమర్శించారు.

కాలనీలో సరైన రవాణా సౌకర్యం లేక ప్రజలు ఉద్యోగాలకు వెళ్లడంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం నిర్మించిన ఎస్టీపీ పంప్ హౌస్ నుంచి వస్తున్న దుర్వాసనతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దోమల సమస్య అధికమై ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందన్నారు.

కాలనీలో గంజాయి సేవించే వ్యక్తుల సంచారం పెరగడంతో మహిళల భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు అధికారులకు పలుమార్లు సమాచారం ఇచ్చినా కాలనీకి రావడం లేదని ఆరోపించారు. గంజాయి సేవించే వ్యక్తులు కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు.

ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కాలనీవాసులకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. ప్రతి బ్లాక్‌కు ఒక్కో బోర్‌వెల్ ఏర్పాటు చేసి నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

# నెల రోజులుగా వడ్ల సెంటర్లలో రైతుల గోష మంత్రికి అధికారులకు కనబడుట లేదా?

**మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు పతిపాక వెంకటేష్,**

**వెలగటూర్,మే 17 (చట్టం):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం మొక్కట్రావుపేట్ ముత్తునూరు వడ్ల సెంటర్లలో వరికాళ్ళలో రైతుల శెవాలు చూస్తావా రేవంత్ రెడ్డి,వడ్లు పండించటం ఒక వంతు పండించిన వడ్లు కొనుగోలు సెంటర్లో జోకటం ఒకవంతు నెలరోజులుగా వడ్ల సెంటర్‌లో రైతులు గోస మీకు కానుబాదుతాలేదా ఒక క్వింతలుకు 8 కిలోలు కట్ చేయడం మంత్రి లక్ష్మణ్‌కుమార్, చెప్పారా లేద కలెక్టర్ సత్యప్రసాద్, చెప్పారా లేక ప్రభుత్వం పెద్దలు చెప్పారా ఎవరు చెప్పరు ఇన్ని కిలోలు కట్ చేయమని న్యాయమా మీకు మంచిర్యాల్ జిల్లాలో రైతులు చనిపోయిన ఇప్పటి వరకు స్పందించలేదు కనిసం మీ నియోజకవర్గంలో రైతుల అవస్థలు కనిపించడంలేదు మరి మీరు ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తారు...

రైతేరాజు గాథ బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎంతోక్రుషి చేస్తే మరి మీరు చేస్తున్నదేమిటి గాథ ప్రభుత్వం కొప్పుల ఈశ్వర్ రైస్ మిల్లర్ తో కుమ్మక్కు అన్నారు



కదా ఇప్పుడు మీరు కుమ్మక్కు అయ్యారా అని ప్రజలు నిలదీస్తున్నారు.

ఒక క్వింటాలుకు 8కిలోలు కట్ చేస్తున్నారు అలఫే ఎ గ్రేడ్ వడ్లు బి గ్రేడ్ గా చూపిస్తున్నారు డబ్బులు కట్ చేస్తున్నారు బ్యాగ్ లు ఇవ్వార్సం లేదు లారీలు రావటం లేదు వడ్లు రైస్‌మిల్ లో దించుకుంటాలేరు మరి ఎలా వ్యవసాయం బంద్ చేయమంటారా ఇప్పటికైనా కండ్లు తెరచి రైతుల వడ్లు



తీసుకోని తెలంగాణ రైతులను కాపాడండి.

ఇప్పటి వరకు వడ్ల సెంటర్లో మీరు సంధించలేదు ఇప్పటికైనా స్పందించండి

ఈ కార్యక్రమంలో బి,ఆర్, ఎస్, పార్టీ మండల నాయకులు చల్లూరి రామచందర్ గౌడ్, జూపాక కుమార్, మూగల సత్యం, ముత్తునూరు మరియు ముఖట్రావుపేట రైతులు నాయకులు పాల్గొన్నారు. హనుమాల తిరుపతి, సంఘ శ్రీధర్, గొల్ల రవి, సంఘ తిరుపతి, అనుమాల తిరుపతి సున్నం సత్తయ్య, గవ్వల తిరుపతి, సంఘ శ్రీధర్ ఓరగంటి పోచమల్లు, గొల్ల రవి బోరే రాజమ్మ, యాగండ్ల మల్లేష్, మల్యాల అంజి, ఈదులాయి శంకరయ్య, కూస గంగాధర్, గరుడ రాజయ్య, కొట్టే భూమయ్య, జగడం సోమన్న, కొప్పుల బాపు, కూస మహేష్, అక్కల సతీష్, కొప్పుల విజయ్, కరిడే పెద్ద రాజయ్య, బుద్దే కలవ్వ, కూస గంగాధర్, కన్నం మునేషం, తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి టాపర్లకు ఘన సన్మానం

- **ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించిన మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి.**
- **పాఠశాల కరపత్రం ఆవిష్కరణ...**
- **విద్యార్థులకు మరింత ఉన్నత లక్ష్యాలు సాధించాలని పిలుపు.**

**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం, /మే /17 :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల జడ్పీ హైస్కూల్లో ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాపర్ విద్యార్థులను మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన ప్రత్యేక కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మంద సహస్ర 600 మార్కులకు గాను 561 మార్కులు సాధించి మొదటి



స్థానం, బానోతు నవ్య 558 మార్కులతో రెండో స్థానం, భూక్య అనూష 554 మార్కులతో మూడో స్థానం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. ఈ ముగ్గురు విద్యార్థినులను శాలువాలు కప్పి, అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా పట్టుదలతో చదివితే గొప్ప ఫలితాలు సాధించగలరని ఈ విద్యార్థులు నిరూపించారు. మార్కులు మాత్రమే కాదు, క్రమశిక్షణ, విలువలు కూడా జీవితంలో ఎంతో ముఖ్యమైనవి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ ప్రపంచంలో ముందుండాలని ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల శ్రమ కలిసొస్తేనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయనీ. ఈ టాపర్లు ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలనీ ఇంకా ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని ఇంటర్, డిగ్రీ, పోటీ పరీక్షల్లో కూడా రాణించాలనీ చదువు ఒక్కటే జీవితాన్ని మార్చగల శక్తివంతమైన ఆయుధం. ప్రతి విద్యార్థి తమ కుటుంబానికి, గ్రామానికి గర్వకారణం కావాలనీ. కల్వల పాఠశాల పేరు మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆశిస్తున్నాననీ. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఫలితాలు కొనసాగాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుల సుజాత, ప్రధానోపాధ్యాయుడు బండారు నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ పి సెట్ 2026 ఫలితాలలో "అల్ఫోర్స్" చారిత్రాత్మక విజయం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 17 ,(చట్టం బ్యూరో) :** ప్రకటించబడిన జూర్తాజజు - 2026 ఇంజనీరింగ్, అగ్రికల్చర్ మరియు ఫార్మసి ఫలితాలలో మా "అల్ఫోర్స్" విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి కరీంనగర్ చరిత్రలో కనివిని ఎరుగని ర్యాంకులు సాధించారు. డి.రిత్విక్ (అగ్రికల్చర్ మరియు ఫార్మసి విభాగములో) 11వ ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలవగా పి.చరణ్ (ఇంజనీరింగ్ విభాగములో) 22 వ ర్యాంకుతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. తరువాత సి. హెచ్. లక్ష్మీహసిని (ఇంజనీరింగ్ విభాగములో 74, నిదా (అడఫా) 157, పి.అక్షయ (ఇ) 251, ఎల్. అర్యన్రావు (ఇ)252, మహ్మద్ హూసేన్ (అడఫా) 272, వి. రుచిత (ఆడఫా) 293, ఏ. నాగసింధు (ఇ) 330, బి. అభిఘ్న (ఇ) 430, వి సుహాసిని(ఇ) 439, వి శ్రేయస్ రెడ్డి (ఇ) 487, జై. నయన్ (అడఫా) 505, జి చైత్ర (ఇ) 506, బి.లిఖిత్సాయి (ఇ) 538, ఎల్. అనంతసాయి (అడఫా) 543, కె.అక్షిత (ఆడఫా) 555, జి. లాస్యరెడ్డి (ఇ) 614, జి హర్షిత (అ డ ఫా) 637, టి .హర్షిత (అ డ ఫా) 697, టీ .సహస్ర (ఇ)739, జె. జస్రిత్స సాయి






(ఇ)745, డి. విశ్వతేజ (ఇ) 772, యమ్. సిరిమణి (అడఫా) 814, సయ్యద్ మలాజోద్దీన్ (అడ ఫా) 836, షరిన్నాతిమా (అడఫా) 898, కె. ధనుష్ (ఇ) 904, పి.చంధన(ఆడఫా) 905, యన్. జస్వంత్సాయి (అడఫా) 921, కె. అక్షయ (ఇ) 951, ఎల్. ప్రణయని(ఇ) 954, ఎన్. రత్నప్రకాశ్ (ఇ) 961, ర్యాంకులతో అల్ఫోర్స్కు అఖండ విజయం అందించారు. 32 మంది విద్యార్థులు 1,000 లోపు ర్యాంకు సాధించడం విశేషం. 57 మంది విద్యార్థులు 2,000ల లోపు ర్యాంకులు, 88 మంది విద్యార్థులు 3,000ల లోపు ర్యాంకులు, 127 మంది విద్యార్థులు 4000 ల లోపు 169 మంది విద్యార్థులు 5,000ల లోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్ కీర్తి ప్రతిష్టలను దశదిశలా చాటారని ఈ సందర్భరముగా తెలియజేయుచున్నాను. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక అత్యద్భుత ర్యాంకులు సాదించడం "అల్ఫోర్స్"కు మాత్రమే సాధ్యమని ఈ ఫలితాలు తెలియజేయుచున్నాయి. ఈ మధ్య ప్రకటించబడిన IIT (MAIN) ఫలితాలలో కూడ "అల్ఫోర్స్" చారిత్రాత్మక విజయం సాదించింది. 450 మంది విద్యార్థులు IIT (ADVANCED)కు అర్హత సాదించడం "అల్ఫోర్స్" మరో సంచలనం. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ మరియు విద్యార్థుల కృషివల్ల "అల్ఫోర్స్" ఇంతటి ఘనవిజయాలు సాదించగలుగుతుంది. రాబోయే IIT (ADVANCED) మరియు NEET ఫలితాలలో కూడ "అల్ఫోర్స్" మహట్నున్నత ర్యాంకులతో ముందంజలో ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. జూర్తాజజు - 2026 ఫలితాలలో ర్యాంకులు సాదించిన మా "అల్ఫోర్స్" చిన్నారులను మరియు వారి తల్లిదండ్రులను నేను మన: స్పూర్తిగా అభినందిస్తున్నాను మరియు ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.

# మహాన్యూస్ అధినేత వంశీ వ్యాఖ్యలు సిగ్గుచేటు BJP కోవర్ట్ వంశీ

- RS **పునీత్ పై చేసిన వ్యాఖ్యాలు వెనక్కి తీసుకోవాలి**
- BRS **నాయకులూ కొంకటి శేఖర్**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా /మే 17 ,(చట్టం బ్యూరో) :** RS ప్రవీణ్ కుమార్ తనయుడు మీద మహాన్యూస్ వంశీ పెట్టిన మహాన్యూస్ లో పెట్టిన పోల్స్ వేంటానే డిలిట్ చేయాలి లేకుంటే తగిన రీతిలో బుద్ది చెప్తం అన్నారు దేశ వ్యాపంగా సంచలనశీ అవుతున్న ఒక మైనర్ అమ్మాయిపై అఘాయిత్యం చేసిన బండి భగీరథ్, ఆ అబ్బాయి చేసింది తీవ్రమైన నేరం అని ప్రెస్మిట్స్ పెట్టీ కేసు విషయం పురోగతి సాధించేలా వీరోచిత పోరాటం చేసిన దీ=ూ ్రుఖుతీఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి RS Praveen Kumar గారి కుమారుడు నీతి పరుడా ? అంటూ మహా న్యూస్లో పోల్ పెట్టీ తన కుసంస్కారం కుటిల నీతి బయట పెట్టినాడు, అసలు నువ్ మీడియా ప్రతినిదివా లేక దీఖీూ కార్యకర్తవ నీకు రాజకీయాలు ఇష్టం ఉంటె వెళ్లి దీఖీూ పార్టీలో జైన్ క అంతే కానీ ఇలాంటి చిల్లర పోల్స్ పెట్టుడు బందు చేయి ఇలాంటి లత్కోర్ చజర్నలిస్టు కి తెలంగాణ ప్రజలు అతి త్వరలో బుద్ది చెప్పడం ఖాయం.ఇది మల్లి రిపీట్ ఆయితే బాగోదు అని అన్నారు తెలశీగాణా ప్రజలు నిన్ను నీ న్యూస్ ఛానల్ ని బాయికాట్ చేస్తాం అన్నారు



# మోడల్ కాలేజ్లో దరఖాస్తుల ఆహ్వానం

**ప్రిన్సిపాల్ పరిమి నవీన్**

**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం 17/మే :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని కల్వల ఆదర్శ జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈనెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని, ప్రిన్సిపాల్ పరిమి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ధరకాస్తుల ప్రక్రియ ఈనెల 13 నుంచి కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను మే 27న ప్రకటించి,28 నుంచి 30 వరకు ధృవపత్రాల పరిశీలనతో పాటు ప్రవేశ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.కళాశాలలో ఎంపీసీ,బైపిసి.ఎం.ఇ.సి, ఎ.సి , కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఏసిఈ గ్రూపులో అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులు బోధించబడతాయని పేర్కొన్నారు. పదో తరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. బాలికల కోసం 100 మంది విద్యార్థినులకు ఉచిత హాస్టల్ సదుపాయం కల్పించబడినందున జిల్లాలో ఏ ప్రాంతానికి చెందిన విద్యార్థులైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ పరిమి నవీన్ ,కోరారు.



# మృతుని కుటుంబానికి అండగా నిలిచిన మానవత్వ వాదులు.




**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/ కేసముద్రం 17/మే :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలములోని కలువల లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కందిపాటి రాము కుటుంబానికి గ్రామానికి చెందిన యువకులు భారీగా ఆర్థిక సహాయాన్ని అందించారు. హైదరాబాద్ ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ సిబ్బంది రూ.2.5లక్షలతో పాటు గ్రామానికి చెందిన బొగ్గుల రాజేష్ అతని మిత్ర బృందం కలిసి మొత్తం రూ.5.64లక్షలను సేకరించి ఆదివారం రాము కుటుంబానికి మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గండి శ్రీనివాస్, బొగ్గుల నాగయ్య, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మోడెం రవీందర్ గౌడ్, మూరగుండ్ల యాదగిరి, ఉపసర్పంచ్ పెదగాని రవి, పెరుమాళ్ల ఎల్ల గౌడ్ పాల్గొన్నారు.

# బండ బావికి మోత బంక రేగడి తోట ధోని ఆరదురన్న దయపారదురన్న కరువు తొలిగేది ఎప్పుడో పరువు నిలిచేది ఎప్పుడు

**టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామడుగు రాజేష్**

**వెల్గటూర్, మే 17 (చట్టం):** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం రాష్ట్రంలో రైతులు పండించిన వడ్లు కొనుగోలు చేసే పరిస్థితి కూడా లేదని టబి,ఆర్,ఎస్, పార్టీ సీనియర్ నాయకులు రామడుగు రాజేష్ మండిపడ్డారు.

50 రోజులుగా వడ్లు కల్లాల్లోనే ఆగం అవుతున్నాయి. రైతు కష్టానికి ధర లేదు ప్రభుత్వం స్పందన లేదు. రాష్ట్రంలో ప్రతి రైతుకంట ఆవేదనే కనిపించింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని అయిపోయింది. మళ్లీ ఈ ప్రభుత్వానికి అవకాశం రాదని ప్రజలే మాట్లాడుకుంటున్నారు అని అన్నారు

ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న ఈ ప్రభుత్వంపైన యువతలో తీవ్ర అసంతృప్తి పెరుగుతోందని రాజేష్ పేర్కొన్నారు.



# ఇచ్చిన హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం...

## పార్టీ ఐడి కార్డు తో ప్రతి కార్యకర్తకు గుర్తింపు...

### వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు శ్రీ కె.కె. రాజు





ఈరోజు 25వార్డు సీతంపేట వెన్నెల ఫంక్షన్ హాల్లో 25వార్డు అధ్యక్షుడు మువ్వల పోలరావు గారి ఆధ్వర్యంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ 25వ వార్డు నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది.. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కె.కె రాజు గారు ముఖ్య అతిథిగా పాల్గొని నాయకులు,కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీ కె.కె.రాజుగారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు అమలు చేయలేక కూటమి ప్రభుత్వం అనతి కాలంలోనే ప్రజలు నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటుందని అన్నారు. అమరావతి అభివృద్ధి పేరుతో వేలకోట్లు ప్రజాధనంను కూటమి ప్రభుత్వం లూటి చేస్తుంది అని మండిపడ్డారు. రానున్న కాలంలో వైసీపీ క్యాడర్ నేరుగా జగన్ గారితో మమేకం అయ్యే విధముగా పార్టీ కమిటీ లు నిర్మాణం చేబడుతుంది అని, వైసీపీ లో ప్రతి కార్యకర్తకు సమూచిత స్థానం ఉంటుంది అని అన్నారు. వార్డులో ఉన్న ప్రతి ఒక వైసీపీ కార్యకర్త కూటమి ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజలకు వివరించి రానున్న రోజుల్లో శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ జోన్-1 జి.వి రవిరాజు,యం.సునీల్,కర్రీ మురళీకృష్ణ రెడ్డి,దల్లి రామకృష్ణ రెడ్డి, భోగవల్లి గోవింద్, శ్రావణ్ కుమార్,నూకరాజు,మువ్వల సంతోష్, సారిపల్లి సంతోష్, గుదే రాజు,హరికృష్ణ, బోర గోవింద్,స్వర్ణపూడి సత్యనారాయణ,జోరీగల గణేష్ బొమ్మాలి రవి, అప్పలరాజు,నాగు, పవన్,జామి రాజు, అశోక్,రవీంద్ర, శివ,ఉమా, వీరమ్మ, మణి, పావని ముఖ్య నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమోన్మాది దాడి నుంచి యువతిని కాపాడిన ధైర్యవంతుడు

- "గోల్డెన్ అవర్ హీరో" ఎస్ఐ కె.భాస్కరరావుకు డీజీపీ బ్రాంజ్ మెడల్
- విధి పట్ల నిబద్ధతకు రాష్ట్ర స్థాయి గుర్తింపు
- ప్రాణాల కోసం పోరాడిన యువతికి అండగా నిలిచిన పోలీస్ అధికారి సేవలకు గౌరవ వందనం





**విశాఖపట్నం, మే 18,:** పోలీస్ ఉద్యోగం అంటే కేవలం చట్టాన్ని అమలు చేయడం మాత్రమే కాదు... ప్రమాదంలో ఉన్న ప్రాణాలను కాపాడటం కూడా అనే విషయాన్ని తన సేవల ద్వారా నిరూపించిన అధికారి ఎస్ఐ కె.భాస్కరరావు. విధి నిర్వహణలో చూపిన అంకితభావం, ప్రజల పట్ల మానవత్వం, నేరాల నియంత్రణలో ప్రతిభకు గుర్తింపుగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా ఆయనకు ప్రతిష్ఠాత్మక "డీజీపీ బ్రాంజ్ మెడల్" ప్రకటించడం విశాఖ పోలీస్ వర్గాల్లో ఆనందాన్ని నింపింది. గతంలో విశాఖ నగరంలోని పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన భాస్కరరావు, అనేక క్లిష్ట పరిస్థితుల్లో వేగంగా స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడిన అధికారిగా గుర్తింపు పొందారు. ముఖ్యంగా ప్రేమోన్మాది దాడికి గురైన యువతిని సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాపాయం నుంచి బయటపడేలా చేసిన ఘటన ఆయన సేవా చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయింది.

**ప్రేమోన్మాది దాడి... రక్తపు మడుగులో యువతి**

నగరాన్ని ఒక్కసారిగా కుదిపేసిన ఆ ఘటనలో ఓ యువతి ప్రేమోన్మాది దాడికి గురై తీవ్రంగా గాయపడింది. దాడి జరిగిన ప్రాంతంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. తీవ్ర రక్తస్రావంతో యువతి ప్రాణాపాయ స్థితిలో ఉండగా, అక్కడికి చేరుకున్న ప్రజలు భయంతో నిలబడి చూసే పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న ఎస్ఐ భాస్కరరావు పరిస్థితిని అంచనా వేసి ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు. అంబులెన్స్ కోసం వేచి చూస్తే సమయం వృథా అవుతుందని భావించిన ఆయన, వెంటనే తన బైక్‌పైనే యువతిని ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌ను చీల్చుకుంటూ వేగంగా ఆసుపత్రికి చేరుకుని వైద్యులకు అప్పగించారు. వైద్యులు కూడా "మరో కొన్ని నిమిషాలు ఆలస్యమైతే ప్రాణాలు కాపాడటం కష్టమయ్యేది" అని పేర్కొన్నట్లు అప్పట్లో చర్చ జరిగింది.

**"గోల్డెన్ అవర్"ను సద్వినియోగం చేసిన పోలీస్ అధికారి**

వైద్యరంగంలో ప్రమాదాలు లేదా దాడుల సమయంలో తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారు. ఆ సమయంలో బాధితుడికి సరైన చికిత్స అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ విషయాన్ని సమర్థంగా అర్థం చేసుకున్న ఎస్ఐ భాస్కరరావు, తన ప్రాణాలకే ప్రమాదం ఉన్న పరిస్థితుల్లో కూడా వెనుకడుగు వేయకుండా మానవత్వంతో స్పందించారు.

పోలీస్ అధికారి మాత్రమే కాకుండా ఒక సాధారణ మనిషిగా బాధితురాలి ప్రాణం కోసం పరుగెత్తిన ఆయన చర్యలకు అప్పట్లో ప్రజలు ప్రశంసలు కురిపించారు. సోషల్ మీడియాలో కూడా భాస్కరరావుపై ప్రశంసల వెల్లువ ఎగిసిపడింది. "ఇలాంటి పోలీసులు సమాజానికి అవసరం" అంటూ పలువురు అభినందించారు.

**నేరాల నియంత్రణలో ప్రత్యేక గుర్తింపు**

ఎస్ఐ భాస్కరరావు కేవలం ఈ ఒక్క ఘటనతోనే కాదు... తన మొత్తం సేవా కాలంలో అనేక క్లిష్ట కేసులను ఛేదించి మంచి దర్యాప్తు అధికారిగా గుర్తింపు పొందారు. నగరంలో జరిగిన పలు చోరీలు, గొడవలు, మహిళలపై దాడులు, మోసాల కేసుల్లో వేగంగా స్పందించి నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించారు.

ప్రజల సమస్యలు విన్న వెంటనే స్పందించడం, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించడం, యువతలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాల్లో కూడా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. సహచర సిబ్బందితో సమన్వయం కలిగి పనిచేసే అధికారి అనే పేరు కూడా సంపాదించారు.

**పోలీస్ శాఖలో ఆదర్శ అధికారి**

భాస్కరరావు సేవలపై ఉన్నతాధికారులు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారు. "విధి నిర్వహణలో క్రమశిక్షణ, ప్రజల పట్ల సేవాభావం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే తత్వం ఆయనను ప్రత్యేక అధికారిగా నిలబెట్టాయి" అని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు.

డీజీపీ బ్రాంజ్ మెడల్ లభించడం ద్వారా ఆయన సేవలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించిందని, ఇది యువ పోలీస్ అధికారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.

ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన ఎస్ఐ సాధారణంగా పోలీసులంటే ప్రజల్లో భయం ఉంటుంది. కానీ ఎస్ఐ భాస్కరరావు మాత్రం ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అత్యవసర సమయాల్లో బాధితులకు అండగా నిలవడం వల్ల ఆయనపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది.

ప్రేమోన్మాది దాడిలో గాయపడిన యువతిని కాపాడిన ఘటన తర్వాత నగర ప్రజలు ఆయనను "గోల్డెన్ అవర్ హీరో"గా అభివర్ణించడం విశేషం.

**అభినందనల వెల్లువ**

డీజీపీ బ్రాంజ్ మెడల్ ప్రకటించడంతో విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో ఆనంద వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీలు మణికంఠ, మేరీ ప్రశాంతి, లతా మాధురి, ఏడీసీపీలు, ఏసీపీలు, సిఐలు సహచరులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు ఎస్ఐ భాస్కరరావును అభినందించారు.

"ప్రజల ప్రాణాలను కాపాడటం కన్నా గొప్ప సేవ లేదు" అని పేర్కొంటూ ఆయన సేవా తపనను కొనియాడుతున్నారు.

**"పోలీస్ ఉద్యోగం ప్రజల కోసం" -- భాస్కరరావు**

తనకు లభించిన గౌరవంపై స్పందించిన ఎస్ఐ భాస్కరరావు, "ఇది నా ఒక్కరిది కాదు... నా సహచర సిబ్బంది, ఉన్నతాధికారుల సహకారంతో వచ్చిన గుర్తింపు. పోలీస్ ఉద్యోగం ప్రజల కోసం. అత్యవసర సమయాల్లో స్పందించడం మన బాధ్యత" అని వినమ్రంగా పేర్కొన్నట్లు తెలిసింది.

ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రాణాలనే పణంగా పెట్టిన ఎస్ఐ కె.భాస్కరరావుకు లభించిన డీజీపీ బ్రాంజ్ మెడల్... నిజంగా సేవకు లభించిన గౌరవంగా నిలిచింది.

# కరీంనగర్ 51 డివిజన్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 17,( చట్టం బ్యూరో) :** కరీంనగర్ ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు కంది కృష్ణారెడ్డి గ 63వ జయంతి సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్స్ శ్రీ సప్తగిరి మరియు సాయి కృష్ణ ఎలక్ట్రికల్ అండ్ వైన్డింగ్ వర్క్స్ వారు మరియు శివ ఎలైట్ కిడ్నీ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ పి శివకుమార్ డాక్టర్ పి నిరోషా లి సారధ్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది దీనికి ముఖ్య అతిథులుగా ట్రినిటీ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రమణారెడ్డి మానకొండూర్ మండలం గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సురేష్ గారు మరియు 51వ డివిజన్ కమిటీ డెవలప్మెంట్ చైర్మన్ వంగ వెంకటేశ్వర్లు మరియు శ్రీ సప్తగిరి లైన్స్ క్లబ్ మెయిల్స్ అండ్ వీల్స్ డిస్టిక్ కోఆర్డినేటర్ గడప కోటేష్ కుమార్ శ్రీ సప్తగిరి లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కొండం అంజి రెడ్డి గారు సెక్రెటరీ అనివేని శ్రీనివాస్ క్లబ్ వైస్ చైర్మెన్ కేవ ఉపాధ్యక్షులు పామరాజు రామారావు కేవా జిల్లా అధ్యక్షులు దొంత రవీందర్ గారు ప్రధాన కార్యదర్శి తిప్పర్తి రత్నాకర్ గారు మరియు బాడీ సభ్యులు ప్రజలు మెకానికులు పాల్గొనడం జరిగింది అలాగే కీర్తిశేషులు కంది కృష్ణారెడ్డి కుమారులు కంది శ్యామ్ సుందర్ రెడ్డి కంది వెంకట్ రాంరెడ్డి వారు జయంతి సందర్భంగా లిచర్ల భూత్కూర్ నాయిని మల్లేశం మన మెకానిక్ సోదరుడు తనకి పెరాలసిస్ రావడంతో తనకి పదివేల ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజా ప్రతినిధులకు మరియు ప్రజలకు మెకానిక్ సోదరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 17 వ సారి రక్తదానం చేసిన సూదుల శ్రీకాంత్

**బోయిన్ పల్లి మండలం / మే 17 ,(చట్టం న్యూస్ ) :** బోయిన్ పల్లి మండలం బూరుగు పల్లి గ్రామానికి చెందిన సూదుల శ్రీకాంత్ 17 వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని నిరూపించుకున్నారు. నిరుపేద కుటుంబానికి రక్తం అవసరం ఉండడంతో ఫోన్లో సంప్రదించడంతో వారు వెళ్లి రక్తదానం నిర్వహించినట్లు తెలిపారు. మానవత్వమే లక్ష్యంగా సామాజిక సేవే ప్రధానంగా ముందుకు కదులుతున్న సూదుల శ్రీకాంత్ పలువురు అభినందించారు.



# ప్రవేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

### బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 17 ,(చట్టం బ్యూరో) ;** ప్రవేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం ను అమలు చేయడం లేదు అని విద్య అంటే వ్యాపారంలా తయారయిందని ప్రవేట్ విద్యాసంస్థల లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు లేకపోవడం వల్ల ఇష్టారాజ్యంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయి అని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకొని ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని తెలిపారు. ప్రవేట్ విద్యాసంస్థలలో విద్యా సంవత్సరం ప్రారంభంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలలోనే పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు అమ్ముతున్నారని దీనిపై విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అలా జరగకుండా విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడకుండా చూడాలని కోరారు. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొస్తే ఫీజులను ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే చెల్లించవచ్చు అని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు ఏ భారం పడకుండా ఉంటుందని తక్షణమే ఆ దిశగా ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, ప్రశాంత్ ,తదితరులు పాల్గొన్నారు.

---------



# రజకుల ఐక్యత, అభివృద్ధే ధ్యేయం

**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మే 17 చట్టం ప్రతినిధి :** రజకుల ఐక్యత మరియు వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధే ధ్యేయంగా ఆగిరిపల్లి మండల కేంద్రంలో రజక మండల స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి మండల రజక సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రజక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పగడాల సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రజకులు అందరూ రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోగలమని పిలుపునిచ్చారు.





రజక కులస్థులందరూ ఒకే తాటిపైకి వచ్చి సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు.

- మండల పరిధిలోని రజకులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన, సామాజిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.
- రజకులను ఎస్సీ జాబితాలో చేస్తామన్న ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని అన్నారు.

రజక యువత విద్యా, ఉపాధి రంగాల్లో రాణించేందుకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించాలని తీర్మానించారు.

- "రజక వృత్తి నమ్ముకున్న ప్రతి కుటుంబానికి సంఘం అండగా ఉంటుంది. మన హక్కుల సాధన కోసం ఐక్యమత్యంతో ముందుకు సాగాలి." ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సగ్గూర్తి రమేష్, బండి కోటేశ్వరరావు, బుద్ధవరపు గోపి, చిటికెల సుమంత్, సగ్గూర్తి శీను, నైనవరపు వెంకటేశ్వరరావు, శివ నాగేంద్ర, అసానుబాదు శంకర్ పెద్ద సంఖ్యలో రజక సామాజిక వర్గ ప్రజలు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ పై అంబటి సెటైర్లు



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మళ్లీ ముదిరింది. జనసేన అధినేత, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తనదైన శైలిలో కౌంటర్లు వేశారు. పవన్ కళ్యాణ్ తాను ముఖ్యమంత్రి కావడానికి పార్టీ పెట్టలేదని, మరొకరిని ఆ పదవిలో కూర్చోబెట్టడానికే జనసేనను నడుపుతున్నారంటూ అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ఎద్దేవా చేశారు. ఈ విషయం తమకు ఎప్పుడో తెలుసని, ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు కూడా ఇప్పుడిప్పుడే ఆ నిజాన్ని అర్థం చేసుకుంటున్నారని ఆయన సోషల్ మీడియా వేదికగా సెటైర్లు వేశారు.

**పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల నేపథ్యం ఏమిటి?**

గతంలో జరిగిన ఎన్నికల అనుభవాలను ప్రస్తావిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిన్న కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో ఒంటరిగా పోటీ చేయడం వల్ల తీవ్రంగా దెబ్బతిన్నామని, ఆ ప్రభావంతోనే తాను పోటీ చేసిన రెండు నియోజకవర్గాల్లోనూ ఓడిపోవాల్సి వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. పొత్తుల ప్రాధాన్యతను, రాజకీయ వ్యూహాలను వివరించే క్రమంలో పవన్ చేసిన ఈ వ్యాఖ్యలను అంబటి రాంబాబు పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకున్నారు. పవన్ కళ్యాణ్ స్వయంగా తన ఓటమిని, ఒంటరి పోరాట వైఫల్యాన్ని అంగీకరించడాన్ని టార్గెట్ చేస్తూ వైసీపీ లైన్ తీసుకుంది.

**మరొకరి కోసమే పార్టీ.. అంబటి విమర్శల జోరు**

పవన్ కళ్యాణ్ ఎప్పటికీ వేరొకరి రాజకీయ ప్రయోజనాల కోసమే పని చేస్తారనే పాత విమర్శను అంబటి రాంబాబు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. జనసేన ఆశయాలు, ఆ పార్టీ స్థాపన వెనుక ఉన్న అసలు ఉద్దేశం సీఎం పీఠం దక్కించుకోవడం కాదని, కేవలం చంద్రబాబు నాయుడు వంటి నేతలకు లబ్ధి చేకూర్చడానికేనని ఆయన ఆరోపించారు. పవన్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని వైసీపీ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఏదేమైనా, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రస్తుత తరుణంలో పవన్ పాత ఓటములపై అంబటి చేసిన ఈ తాజా ట్వీట్ ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది

------

చట్టం సాహితీ లోకం 95814 19999

## ఆనందానికి చిరునామా.



రేయి పగలు కష్టించిన రైతు, ఆరు బయట విరామము.
పొలంలోన పైరు కోసం చిందించును , చెమట నీటి ప్రవాహము.
అలసిపోయిన దేహానికి, చందమామ చల్లని వెన్నెల ఉపశమనం.
కట్టుకున్న ఇల్లాలి చల్లని పలకరింపు ఇస్తుంది కదా సాంత్వనం.
కన్నతల్లి పలికే ఓదార్పు మాటలు పోగొట్టును, తన అలసట.
కాళ్లకు అల్లుకుపోయి ఆటలాడే కుమారుడు, తనకు బాసట.
పచ్చని పైరు పంటల పల్లెటూరు, నిజమైన ఆనందపు చిరునామా.
నులక మంచంలో వేసిన చిన్న కునుకు ప్రశాంతతకు ఖరారునామా.
మమతలూరు పల్లెటూరిలో అన్నదాత నివాసం ఇరుకే కావచ్చును.
కపటమెరుగని వారి మనసులు, వచ్చిన అతిధులకు ప్రేమలు పంచేను.
కాలుష్యం తెలియని కూరగాయలతో, కమ్మని రుచితో కూడిన వంట.
పిల్ల కాలువలో వచ్చే చల్లని నీరు బలిమిని కలిమిని పంచేనంట.

పచ్చని గ్రాసాన్ని ఆరగించే పశువుల సంపద పాడిని పంచును.
పురుగుల కోసం వచ్చే పక్షుల కిలకిలా రావాలు , నిత్యం సందడులు.
చల్లని నీటితో , స్నానం చేసి వేడి వేడి అన్నం ఆరగించంగ
ఒళ్ళు ఎరుగని సుఖనిద్ర పట్టేను, పల్లె వాసులకు కనుల నిండుగ.
డబ్బు కట్టలు లేకపోవచ్చు వారికి, ఇంటిలోని బీరువాల నిండుగ.
కానీ మమతా మమకారాలకు లోటు లేదు, మనసులోన మెండుగ.
వాహనాల రణగణ ధ్వనులు ఎన్నడూ వారిని చికాకు పరచవు.
పరిశ్రమలు వెలువరించే కాలుష్యపు వాయువులు వారిని బాధ పెట్టవు.
విశాలమైన , నిర్మలమైన నీలాకాశమే వారికి చల్లని పందిరి.
అసంఖ్యాక తారల మధ్య, వెలుగుల దివ్వె చందమామ సందడి.
రెక్కలను ముక్కలు చేసి కష్టాన్ని నమ్ముకున్న కర్షకునికి, అసంతృప్తి లేదు.
మితమైన కోరికలతో, సంతృప్తి పడే చోట, ఆనందానికి లోటు లేదు.

పేరు:ముక్కా సత్యనారాయణ
పెనుగంచిప్రోలు,ఎన్టీఆర్ జిల్లా


శ్రీ ముక్కా సత్యనారాయణ గారు

చట్టం సాహితీ లోకం 95814 19999

## సనాతన ధర్మం! నాస్తిక వాద ధర్మం! నిత్య సంఘర్షణ!



మన వేదాలు పురాణాల్లో చెప్పినట్లు,దేవా సుర సంగ్రా మం లాంటిది! ఈ సనాతన, (నాస్తిక) హేతు వాద ధర్మాలు!

దేవతలు సనాతన ధర్మం అయితే, రాక్షసులు హేతు వాద ధర్మం! ఏది ఏమైనా చివరకు ఇరువురు మోక్షాన్ని ఆకాంక్షించే వారే! దూరంగా దగ్గరగా, స్థూలంగా,సూక్ష్మంగా భగవంతుని చేరుకున్న వారే!

సత్యమేవ జయతే అహింసా పరమో ధర్మ! మూలాల పైన సార్వత్రికంగా సార్వజనీయం గా నిత్య సత్యమై, శాశ్వతమై విశ్వ మానవ శ్రేయస్సు సౌభ్రా తృత్వాన్ని ఆకాంక్షించే సనాత నమైన సనూతనంగా వెలిగే ధర్మం! జీవ కారుణ్యంతో 84 లక్షల జీవరాశుల, పంచభూ తములు,ప్రకృతిని, జీవాత్మ లో పరమాత్మను ఆరాధించే విశిష్ట ధర్మం! దేనికి విరుద్ధం కాదు! దైవ ప్రియత్వాన్ని ఆస్తికత్వాన్ని ప్రేరేపించేది!
దేవగణ గుణ సంభూతశీ!

ఈ మానవ లోకంలో మానవ త్వాన్ని ప్రేరేపించే ఏ ధర్మం, ఏ వాదం మనకు పరిపూర్ణత నిస్తుందో దాని వైపే మనం నడవాలి! ఆచరించాలి! అది ఏ ధర్మమైనసరే, ఇచ్చట విచ క్షణ, వివేకము, జ్ఞానం సరి తూకంగా,లోకోపకారానికై, లోక కళ్యాణార్థమై నిలవాలి!
అది చూడగలిగే దృష్టిని బట్టి ఆధారపడి ఉంటుంది!

చీకటి ఉన్నప్పుడే కాంతి విలువ తెలిసినట్లు,నాస్తిక, హేతువాదములు ఉన్నప్పుడే ఆస్తికత విలువమెరుగుపడు! ఏవాదమైనా, ఏ ధర్మమైన జీవకారుణ్యాన్ని మానవ జాతి అస్తిత్వాన్ని కాపాడు తూ పునర్ నిర్మించగలగాలి!

మన జీవనాధారానికి రక్తంలో తెల్ల రక్తకణాలు,ఎర్రరక్త కణా లు ఉన్నట్లే! హేతువాదం సరి అయినదైనా ధర్మంమూలాలు త్రుశీచేయక, కాపాడాలి! సర్వే ధర్మ సుఖినోభవంతు!

డాక్టర్ ప్రాత రాజశేఖర్, ప్రభుత్వ విశ్రాంత గురుకుల ఉపాధ్యాయులు, చోడవరం.



చట్టం సాహితీ లోకం 95814 19999

## బాల్యంలో నాటిన వెలుగు



మొక్కలైనా
చిన్న పిల్లలైనా
ఎలా పెంచితే
అలా పెరుగుతాయి
ఎలాంటి నేల దొరికితే
అలాంటి ఫలాలు ఇస్తాయి

చిన్న మొక్కకు నీళ్లు ఎంత అవసరమో
చిన్న మనసుకు మంచి మాటలు అంత అవసరం
వేర్లు బలంగా ఉంటేనే
చెట్టు తుఫాన్లను తట్టుకుంటుంది
విలువలు బలంగా ఉంటేనే
మనిషి జీవితాన్ని నిలబెట్టుకుంటాడు

బాల్యంలో విన్న కథలు
కేవలం వినోదం కావు
అవి భవిష్యత్తును తీర్చిదిద్దే విత్తనాలు
నీతికథలు మనసుకు దారి చూపుతాయి
వీరగాథలు రక్తంలో ధైర్యం నింపుతాయి
దేశభక్తి గీతాలు
తల్లి నేలపై ప్రేమ పెంచుతాయి

మన సంస్కృతి, సంప్రదాయాలు
పుస్తకాలలో మాత్రమే కాదు
పెద్దల ప్రవర్తనలో కనిపించాలి
పిల్లలు చెప్పిన మాటలకన్నా
చూసిన జీవితం ఎక్కువగా నేర్చుకుంటారు

అలాగే
సాంకేతికతను పరిచయం చేస్తే
ఆలోచనలకు కొత్త రెక్కలు వస్తాయి
విజ్ఞానాన్ని చూపిస్తే
ప్రశ్నలు పుడతాయి
పరికరాలను చేతితో తాకనిస్తే
సృజనాత్మకత మేల్కొంటుంది

కేవలం మార్కులు తెచ్చే చదువు కాదు
మనసును మలిచే విద్య కావాలి
ఉద్యోగం కోసం మాత్రమే కాదు
ఉపయోగం కోసం నేర్చుకునే తరం రావాలి

ఎందుకంటే
ఈరోజు మనం నాటే విలువలే
రేపటి సమాజానికి నీడనిస్తాయి
ఈరోజు పిల్లల మనసులో వెలిగించే దీపమే
రేపటి దేశ భవిష్యత్తవుతుంది

రామడుగు వేణుగోపాల్
దోహా , ఖతార్
(మంథని )

చట్టం సాహితీ లోకం 95814 19999

అంశం : చిత్రకవిత

## అమ్మ ప్రేమ స్వరూపం



నవమాసాలు మోసిన తల్లి కన్న కలల కళా రూపం తన బిడ్డపై అపురూప ప్రేమ సాదృశ్యం,,,, ,,,,,
తన ఎదపై ఆడుకునే బిడ్డ ఆ అమృతమయ ప్రేమ లాలిత్యాన్ని చూరగొనే పసికందు అమ్మను హత్తుకుని సౌఖ్యంగా స్వర్గంలో ఉన్నట్లు ఇహలోకం తెలియని బహుసున్నితమైన ఆనందం అనుబంధం బిడ్డది,,,,,,,,
తల్లి చనుపాలిచ్చి తన బిడ్డపై ఎనలేని ప్రేమ అమృతాలు కురిపించే త్యాగమూర్తి నూతన సృష్టికి, పుట్టుకకు కారణభూతి,,,,,,,,
తల్లి ప్రేమ నవనీతం తన బిడ్డ బోసినవ్వులలో హరివిల్లులను చవిచూసే అద్భుతమైన ఆనందాల పెనవేత గోరుముద్దలు తినిపిస్తూ లాలిపాడుతూ లాలించే తల్లి హృదయం మీగడ తరగలు,,,,,,,,
తన బిడ్డ ఎక్కడ ఏడుస్తుందోయని కంటికి రెప్పలా కాపాడుకునే తల్లి ప్రేమ మధురం సుమధురం తన జీవితమే బిడ్డకోసమన్నట్లు ఆ ఊపిరి బాసలు తనకు బిడ్డకు మధ్య ప్రేమ అనురాగాల సేతువు,,,,,,,,
అంత అలవికాని ప్రేమ రంగరించి పోసిన తల్లిని పెద్దవాడైనా చిన్న దెబ్బతగిలినా అమ్మా అననిది మానుకోడు అప్పుడు ఈ సృష్టిలో ఎవ్వరూ గుర్తుకురారు,,,,,,,,,,
అందుకే అన్నారు అమ్మ ప్రేమకు మారుపేరు అని. నీ రూపం శిల్పం అంతా అమ్మ గారాబాల ప్రతిరూపం, దర్పణంలో ముఖం చూసుకున్నట్లు హృదయం నుంచి హృదయం ఉద్భవించిన దైవానికి దాసునివి,,,,,,,,

అపరాజిత్
సూర్యాపేట

చట్టం సాహితీ లోకం 95814 19999



## సాహితీ సుగంధం

అక్షరాల మీద మోజు కలిగింది---
ఆత్మను ఆవహించే అమృత బిందువులై,
మనసు మట్టిలో మొలకెత్తి
మధుర భావాల తోటగా విరబూసిందిll

పుస్తకాల మీద ప్రేమ పుట్టుకొచ్చింది---
పుటలు తిరగేస్తుంటే పరిమళాలు వెదజల్లింది,
ప్రతి గ్రంథం ఓ గురువై
జీవిత సత్యాలు నేర్పిందిll

కవితల మీద మనసు పడింది---
పదాల పల్లకిలో ఊరేగే భావాలు
హృదయ తంతులను తాకి,
నిశ్శబ్దానికే స్వరాల హారతి ఇచ్చిందిll

కవుల మీద ఇష్టం ఏర్పడింది---
వారి కలం నుంచి జారిన అక్షరాలు
అమృత ధారల్లా అనిపించి,
ఊహల ఆకాశంలో మనసు విహరించిందిll

పఠనంపై ఆసక్తి పెరిగింది---
చదువుతుంటే చైతన్యం చెలరేగింది,
ప్రతి వాక్యం కొత్త వెలుగై
అజ్ఞాన చీకట్లను పారద్రోలిందిll

సాహిత్యంపై అభిలాష ప్రబలమయ్యింది---
అది కేవలం అభిరుచి కాదు,
ఆత్మకు ఆహారమై, అనుభూతులకు ఆలంబనమై
జీవితానికి జ్యోతిగా నిలిచిందిll

ఇలా---
అక్షరం అక్షరంగా ఆరాధన పెరిగింది,
పుస్తకం పుస్తకంగా ప్రేమ విస్తరించింది,
కవిత కవితగా హృదయం పరవశించింది,
సాహిత్య సౌరభంతో జీవితం సుగంధమైందిll

--- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.



చట్టం సాహితీ లోకం 95814 19999

## పెరిగిపోతున్న మత మౌఢ్యం



భారతదేశం సకల మతాలకి నిలయమైంది
భారతీయులందరు మతాల భక్తులు
పాపం పుణ్యం అంటూ గోలచేసే జీవనపరులు
భగవద్గీత బ్రతుకు నాదంటాడు ఒకడు,
బైబుల్ జీవితం నాదంటాడు ఇంకొకడు,
ఖురాన్ పవిత్ర జీవితం నాదంటాడు మరొకడు,
మతాలు మత్తులో మత్తు ఎక్కి మతాల గొడవలు ఎక్కువయి,
స్త్రీలను వివస్త్రంగా వీధుల్లో తిప్పింది నా దేశం,
ప్రతివాడు మత జీవితం జీవిస్తే తప్పులు చేసేదెవరు?
నమ్మకాలతో పవిత్రంగ ప్రతి వాళ్ళు బ్రతుకుతుంటే!
ఉన్మాదులు ఎవరు?రేపిస్టులు ఎవరు?దోపిడీదారులు ఎవరు?
మతగ్రంధాల నీతి బోధనలువిని
మతగ్రంధాలు దిండులు క్రింద దాచిపెట్టి,
నీచమైన బ్రతుకులు బ్రతుకుతు,
మతగ్రంధాల మాటలు జాతరలో వదిలిపెట్టి,
మతం మనుషుల మెదళ్ళలో చీడపురుగై తొలుస్తుంటే,
మనుషులు సభ్యత మర్చిపోయి
మనిషిలో మానవత్వంనుచంపి,
మనిషిని మనిషే చంపుతుండు,
మతాన్ని రాజకీయం చేసి,
మత భావాలను రాజకీయ అజెండా చేసి,
మతదేశాంగ మలుసుకొని,
మతాలతో గొడవలు ఎక్కువ చేసి,
రాజకీయ అధికారం చేతబట్టి,
దేశంలో మతమౌఢ్యంను పాలకులే పెంచుతుండె,
మత ఉన్మాదులు పెరుగుతుండే
ఉన్మాద చర్యలు పెరుగుతుండే,
మత మౌఢ్యం ప్రతిచోట నేడు పెరిగుతుండే..

// గురువు //
కార్తీక్ దుబ్బాక.
విజయవాడ..

## న్యాయమూర్తి చంద్రయ్య గారికి నా అక్షర నివాళి



సామాజిక న్యాయమే అభివృద్ధికి దోహదమని
సాంఘిక సంక్షేమ మున్సిపల్ శాఖల ప్రభుత్వ న్యాయవాదిగా
ప్రజాహితమే కర్తవ్యమని పనిచేసి
హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులై
శాశ్వత న్యాయమూర్తిగా తదుపరి
సేవలందించి ప్రజాదరణ పొంది
పదవీ విరమణ తరువాత తెలంగాణ రాష్ట్ర మానవహక్కుల కమీషన్
తొలి చైర్మన్ గా నియమింపబడి
పేదల, మహిళల, దివ్యాంగుల, చిన్నపిల్లల హక్కుల పరిరక్షణ చేసిన జస్టిస్ చంద్రయ్య
మీరు నెల్సన్ మండేలా ,మరియు యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ పురస్కారాలకే వన్నె తెచ్చిన మహనీయులు
సమాజహిత సాహిత్యమే అభివృద్ధికి దోహదమని
సాహితీ సభలలోకవులను ప్రేరణ చేసిన
మీరు ఆప్యాయంగా ఎలావున్నారని పలుకరిస్తు సాహితీవేత్తలు న్యాయమూర్తుల కన్నా మిన్నయని
హైదరాబాద్ లో "సాహిత్యమే సమాజదర్పణం" అన్న నాకవితను ప్రశంసిస్తు
స్వహస్తాలతో నాకు ఆత్మీయ సత్కారం
చేయడం మరువలేనిది
ఆ జ్ఞాపకం మరువక ముందే
మీరు అందని తీరాలకు చేరడం బాధాకరం.
'జాతస్యహి ధ్రువో మృత్యు,: 'అని తెలిసినా
మీ ఆప్యాయత సేవాతత్పరత మరువలేనిది.
అందుకోండి న్యాయదేవతకు ప్రతీకగా నిలిచిన న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య మీకివే నా అక్షర నివాళి....!!

(నిన్న హైదరాబాద్ లో స్వర్గస్తులైన జస్టిస్ చంద్రయ్య గారి కి నే వ్రాసిన అక్షర నివాళి)

కవిమిత్ర,సాహిత్యరత్న
ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్
( పుష్యమి)
విశాఖపట్నం.

చట్టం సాహితీ లోకం 95814 19999

## మంటల్లో మన విద్య .



విద్యార్థి లోకం....
నీట్ అనే పరీక్ష కోసం
నిరంతర కృషితో...
నిద్రలేని రాత్రులు
గడుపుతున్న.... ఓ..
నీట్ యోధులారా... నీ
కఠోర విద్యకు నిలువెత్తు
వందనాలు... నీ నికార్సైన
శ్రమకు చరమగీతం
పాడాలని.. నిన్ను
నీట్ పేరుతో నిలువునా
నీటిలో ముంచాలని
కేంద్ర ప్రభుత్వ... ఓ..
కపట నాటకం.
మోడీ... నిర్లక్ష్యంతో
బడా నాయకుల
ప్యాకేజీలు...
పరీక్ష పత్రాల లీకేజీలు.
22 లక్షల మంది ఆశలు
అడివాశలు.
విద్యార్థి లోకం ఆ..
కన్నీటి శోకం... అవి చూసైనా
కమలదళం కనికరించేనా.?

శ్రీ భార్గవ్ సైదులు, పెంచికల్ దిన్నె,
సూర్యాపేట, 9989023822.

# చట్టం సాహితీ లోకం

95814 19999



## ఎర్రఖిల్లా :

సాయుధ ఖిల్లా
నా ఖమ్మం జిల్లా
దాస్ క్యాపిటల్నే
ఖమ్మం జిల్లా త్వారణంగా
రణరంగాన్ని రగిలించిన
రైతు సాయుధ పోరాటల
 అడ్డా మన ఖమ్మం జిల్లా,
ఎప్పటికీ మరుపురాని
ఉద్యమాల గడ్డ
రైతుసాయుధ
పోరాటాలడ్డా
" నా ఖమ్మం జిల్లా"
ఖమ్మం కండ్లు
నిప్పురవ్వలయ్యాయి
ఖమ్మం చేతులు
కత్తులు పట్టాయి
మమతలూరే ఖమ్మం,
ఎందుకో మండిపోయింది..
నా ఖమ్మం జిల్లా
ఎర్రఖిల్లా సాయుధ ఖిల్లా...
నా ఖమ్మం జిల్లా..
నల్లమల్లల గిరి ప్రసాదుల
మంచికంటిలా
సారధ్య సాహిదనౌక
నిలువెత్తు తుపాకిలకు
నెత్తురులద్దిన
ఉద్యమకారులు
ఉరితాళ్ళను ముద్దాడి
ఉద్యమాలకు ఊపిరిలూదిన
అమర జీవుల కర్మభూమి
నా ఖమ్మం జిల్లా,
ఎర్రఖిల్లా....
"జైలు గోడల్ని
విప్లవ పుస్తకాలుగా,"
మలిచిన మహోన్నత
విప్లవ సాహిత్యం,
నా ఖమ్మం జిల్లా,
ఎరుపు రంగును
ముద్దాడాలని
అస్తమించిన
సూర్యులేందరో
ఆ ఎరుపురంగునే
ఖమ్మం రంగుగా పూసుకున్న
విప్లవయోధులు యెందరో...
దొరల గడిలను
ఎరుపుజండాలతో
కూల్చిన
"ఆ జెండా ఎట్టిదో!
 వేల ఎకరాలభూమిని
నిరుపేదలకు
సాగుభూమిగా
పంచిన ఖమ్మం జిల్లా
చైతన్యమెట్టిదో?
నా ఖమ్మం జిల్లా
ఎంత గట్టిదో?
ఆ ఎరుపు జెండా
ఎంత ఎత్తుదో?
"నక్సల్ బరిఉద్యమాలకై "
దండకారణ్యం పట్టిన
ఖమ్మం యోధులందరో
నా భద్రాద్రి
ముద్దుబిడ్డలేందరో
ఖమ్మంగన్న ఎర్ర బిడ్డల
చిరునామాలు
చెదిరిపోని జ్ఞాపకాలు
విశాలాంధ్రగ్రంథాలయాల్లో
ఎరుపుబిడ్డలచరిత్రలేన్నో "
నిజాం నైజాం
రజాకార్ల అగాడాల
ఆకృత్యాలను,
దొరల దొంగ బుద్ధిని
 తెల్లదొరలనల్లబుద్ధిని
 ఖమ్మంనడిబొడ్డున
బొందాపెట్టిన
ఎరుపు బిడ్డల
చెమట చుక్కలు
"ఎర్రని సాగులయ్యాయి
సాగు పొలాల్లో వికసించిన
ఎర్రని పుష్పాలెన్నో!
ఉదయించిన
ఎరుపుసూర్యలేందరో...!
అస్తమించిన
ఎర్రని చంద్రులేందరో
 ఉదయించిన
ఎరుపు సూర్యులేందరో!
సాయిధ ఫలాలు
సమిష్టిగా పంచిన
ఆ త్యాగాలెట్టివో!
"ప్రతి పూట "
మనం తింటున్న
అన్నం కోసం
ఖమ్మంఅడివన్నాల
 త్యాగాలెట్టివో!
 ఖమ్మంఖిల్లానడిగితే
చెప్తాయి!
భారత స్వాతంత్రోద్యమానికి
పురిటి గడ్డ
రైతుసాయుధ పోరాటం
తరాల అంతరాలపైన
కమ్యూజినిజం
ఈ ప్రపంచానికి
 సరికొత్త దృక్పథం
 ప్రపంచానికి
అన్నం పెట్టింది
కమ్యూనిజం
బానిస సంకెళ్లుతెంచింది
" మార్క్సిజం "
వర్ధిల్లాలి కమ్యూనిజం
తొలిప్రొద్దు మన ఖమ్మం.

డాక్టర్ :కందులు సుధాకర్
తెలంగాణ కేసరి
సోషల్ రిఫార్మర్
సేవ రత్న,స్వర్ణ నంది
అవార్డు గ్రహీత,
మానవ విలువల
సందేశకుడు,
ఖమ్మం జిల్లా
9390708322.-

# లావణ్య త్రిపాఠి 'సతీ లీలావతి' అప్పుడే ఓటీటీలోకి




మెగా కోడలు, టాలీవుడ్ నటి లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో నటించిన లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'సతీ లీలావతి' బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాలను అందుకోలేకపోయింది. ఈ నెల 8న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, నేటి తరం ప్రేమ, పెళ్లి బంధాలు మరియు విడాకుల చుట్టూ తిరిగే ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కింది. అయితే, కథనంలో లోపాలు మరియు బలహీనమైన కంటెంట్ కారణంగా ఈ చిత్రం ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయింది. దీంతో థియేట్రికల్ రన్ ముగియకముందే ఈ సినిమా ఓటీటీ బాట పట్టింది.

**విడుదలైన 12 రోజులకే ఓటీటీలోకి**

సినిమా విడుదలైన కేవలం 12 రోజుల వ్యవధిలోనే దీనిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమయ్యారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'సన్ నెక్స్ట్' ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకుంది. ఈ వారం బుధవారం నుండి 'సతీ లీలావతి' సినిమా తెలుగుతో పాటు తమిళ వెర్షన్‌లోనూ డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు అందుబాటులోకి రానుంది. థియేటర్లలో మిస్ అయిన ఫ్యామిలీ ఆడియన్స్ ఈ చిత్రాన్ని ఓటీటీలో వీక్షించవచ్చు.

----

# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లి క్రికెట్ ప్రపంచంలో మరో అరుదైన మైలురాయిని అధిగమించి సరికొత్త చరిత్ర సృష్టించారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లి ఈ చారిత్రాత్మక ఘనతను తన పేరిట లిఖించుకున్నారు. ఈ మ్యాచ్‌లో వ్యక్తిగత స్కోరు 7 పరుగుల వద్దకు చేరగానే, ఐపీఎల్ చరిత్రలోనే ఒకే ఒక్క ఫ్రాంచైజీ (ఆర్‌సీబీ) తరఫున ఓపెనర్‌గా అత్యధికంగా 5,500 కంటే ఎక్కువ పరుగులు పూర్తి చేసిన ఏకైక బ్యాటర్‌గా విరాట్ రికార్డు సృష్టించారు. గతంలో శిఖర్ ధవన్, డేవిడ్ వార్నర్ లాంటి దిగ్గజాలు వేర్వేరు జట్లకు ప్రాతినిధ్యం వహిస్తూ ఓపెనర్‌గా ఈ రకమైన మైలురాళ్లను అందుకున్నప్పటికీ, లీగ్ ప్రారంభం నుండి ఒకే జట్టుకు ఆడుతూ ఈ ఘనత సాధించడం కేవలం కోహ్లికే చెల్లింది.

**9 సీజన్లలో 500ం రన్స్.. వార్నర్, రాహుల్ రికార్డులు బ్రేక్!**

ఈ మ్యాచ్‌లోనే విరాట్ కోహ్లి మరో మైండ్ బ్లోయింగ్ రికార్డ్‌ను కూడా తన ఖాతాలో వేసుకున్నారు. ఈ ప్రస్తుత సీజన్‌లో పరుగుల వరద పారిస్తున్న కింగ్ కోహ్లి 500 పరుగుల మార్కును దాటేశారు. దీనితో ఐపీఎల్ చరిత్రలో ఓవరాల్‌గా ఏకంగా 9 విభిన్న సీజన్లలో 500 కంటే ఎక్కువ పరుగులు సాధించిన ప్రపంచపు మొట్టమొదటి ఆటగాడిగా విరాట్ సరికొత్త రికార్డు నెలకొల్పారు. ఈ జాబితాలో ఇప్పటివరకు చెరో 7 సీజన్లతో ద్వితీయ స్థానాల్లో ఉన్న ఆస్ట్రేలియా స్టార్ డేవిడ్ వార్నర్, భారత బ్యాటర్ కేఎల్ రాహుల్‌లను విరాట్ చాలా వెనక్కి నెట్టేశారు. వయసు పెరుగుతున్నా తనలోని పరుగుల ఆకలి ఏమాత్రం తగ్గలేదని కోహ్లి ఈ అద్భుతమైన ఫీట్‌తో మరోసారి నిరూపించారు.

**ఆర్‌సీబీకి వెన్నెముకగా విరాట్.. సెల్యూట్ చేస్తున్న క్రికెట్ ప్రపంచం!**

19 ఏళ్లుగా ఒకే ఫ్రాంచైజీకి కట్టుబడి ఉంటూ, ప్రతీ ఏటా తన ఆటతీరును మరింత మెరుగుపరుచుకుంటూ వెళ్లడం విరాట్ కోహ్లికే సాధ్యమైంది. ఆర్సీబీ జట్టు గెలుపోటములతో సంబంధం లేకుండా ఓపెనర్‌గా దిగి జట్టుకు భారీ స్కోర్లు అందించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. ఈ సీజన్‌లోనూ కోహ్లి సాధిస్తున్న పరుగుల విధ్వంసం ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచడమే కాకుండా, ఆరెంజ్ క్యాప్ రేసులోనూ ఆయనను టాప్‌లో నిలబెట్టింది. క్రికెట్ పట్ల ఆయనకున్న అంకితభావం, అసాధారణ ఫిట్‌నెస్ చూసి అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు సైతం 'నిజంగా నువ్వు కింగ్‌వి అబ్బా' అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



# రిషబ్ పంత్‌కు బీసీసీఐ బిగ్ షాక్!

సీఎస్కేతో జరిగిన కీలక మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ అద్భుత విజయాన్ని సాధించింది. లక్నో జట్టు గెలిచినా ఆ జట్టు కెప్టెన్ రిషబ్ పంత్ కు బీసీసీఐ బిగ్ షాక్ ఇచ్చింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గానూ పంత్‌పై బీసీసీఐ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. లక్నోలోని ఎకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రిషబ్ పంత్ కు రూ.12 లక్షల జరిమానా విధించింది.

ఐపీఎల్ ప్రవర్తన నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం కనీస ఓవర్ రేట్ నిబంధనలను పాటించడంలో విఫలమైనందుకు రిషబ్ పంత్‌ను దోషిగా తేల్చారు. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ఈ సీజన్లో ఇది మొదటి తప్పిదం కావడంతో కేవలం కెప్టెన్‌కు మాత్రమే రూ. 12 లక్షల జరిమానాతో సరిపెట్టారు. ఒకవేళ ఇదే తప్పు మళ్లీ పునరావృతమైతే జరిమానా మొత్తం పెరగడంతో పాటు జట్టులోని మిగిలిన సభ్యులకు కూడా మ్యాచ్ ఫీజులో కోత పడే అవకాశం ఉంటుంది. ఈ సీజన్ ముగియడానికి మరో 15 రోజులు మాత్రమే ఉండటంతో మ్యాచ్‌ల తీవ్రత దృష్ట్యా బౌలింగ్ సమయాన్ని నియంత్రించడం కెప్టెన్లకు పెద్ద సవాలుగా మారింది. ఈ మ్యాచ్‌లో లక్నో జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంపై కెప్టెన్ రిషబ్ పంత్ సంతోషం వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెజెంటేషన్‌లో రిషబ్ పంత్ మాట్లాడుతూ.. ఈ విజయం జట్టు నైతిక స్థైర్యాన్ని ఎంతగానో పెంచిందని అన్నాడు. ఈ సీజన్ ఎలా ముగిసినా సరే, లక్నో జట్టుగా గర్వపడేలా ఆడటమే తమ లక్ష్యమని స్పష్టం చేశాడు. అలాగే జట్టులోని ఆటగాళ్లందరికీ స్పష్టమైన బాధ్యతలు అప్పగించడం వల్లే ఈ విజయం సాధ్యమైందని, తీవ్రమైన ఒత్తిడి ఉండే ఇలాంటి టోర్నమెంట్లలో వ్యూహాలను చాలా సరళంగా ఉంచుకోవడం ముఖ్యమని పంత్ పేర్కొన్నాడు. ఇదే క్రమంలో లక్నో పేసర్ ఆకాష్ సింగ్ ప్రదర్శనను రిషబ్ పంత్ ప్రత్యేకంగా అభినందించాడు. ఆకాష్ సింగ్ ప్లాన్స్ మార్చకుండా క్రమశిక్షణతో బౌలింగ్ చేశాడని, అతని కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని కొనియాడాడు. అలాగే టాక్టికల్ నిర్ణయాల్లో భాగంగా ఇద్దరు విదేశీ ఆటగాళ్లను ఓపెనర్లుగా పంపి, నికోలస్ పూరన్‌ను వన్ డౌన్‌లో (నంబర్ 3) బ్యాటింగ్‌కు పంపాలనే వ్యూహం కూడా తమకు బాగా కలిసివచ్చిందని రిషభ్ పంత్ వివరించాడు.

.......



# టైటిల్ గెలవాలంటే ఆటగాళ్ళు రాణించాలి

## గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్

బ్యాటర్లతో మ్యాచ్‌లు గెలవచ్చని, టైటిల్ గెలవాలంటే మాత్రం బౌలర్లు రాణించాలని గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. అదృష్టవశాత్తు ఈ సీజన్‌లో తమ బౌలర్లు అదరగొడుతున్నాడని తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో గుజరాత్ టైటన్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన శుభ్‌మన్ గిల్ పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే బౌలింగ్ ఎంచుకున్నానని చెప్పాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. పిచ్‌పై తేమ ఉన్నట్లు కనిపిస్తుంది. నిన్న వర్షం పడటంతో పిచ్ కొంచెం జిగటగా ఉంది. సెకండ్ ఇన్నింగ్స్ సమయంలో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారవచ్చు. మా బౌలర్ల అసాధారణ ప్రదర్శనతో వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో గెలిచాం. మా బౌలర్లను మేం నమ్ముతున్నాం. బ్యాటర్లు మ్యాచ్‌లు గెలిపించవచ్చు. కానీ టైటిల్ గెలవాలంటే బౌలింగ్ విభాగం ఫామ్‌లో ఉండాలి. అదృష్టవశాత్తూ మా బౌలర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. ఈ సీజన్‌లో మా బౌలింగ్ విభాగం అత్యుత్తమంగా ఉంది. మాకు మంచి మూమెంటమ్ లభించింది. మా నిలకడైన ప్రదర్శనను కొనసాగించాలి. ప్రస్తుతం ఏ జట్టును తక్కువ అంచనా వేసే దశ కాదు. మేం తదుపరి రెండు మ్యాచ్‌లు గెలిచి టాప్-2లో నిలవాలనుకుంటున్నాం. టాప్-2లో నిలిస్తే అదనపు ప్రయోజనం చేకూరుతోంది. మరో మ్యాచ్ ఆడే అవకాశం దక్కుతుంది. ఆ మ్యాచ్ ఆడే పరిస్థితి రాకూడదని మేం కోరుకుంటున్నాం. కానీ ఆ ఆప్షన్ ఉండటం వల్ల సహజంగా ఆడే అవకాశం లభిస్తుంది. ఈ మ్యాచ్‌లో మేం మా విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతున్నాం.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.మరోవైపు టాస్ గెలిస్తే బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే అన్నాడు. పిచ్‌లో తేమ ఉన్నప్పటికీ, గాలులు వీస్తున్నాయని, సెకండ్ ఇన్నింగ్స్‌లో పెద్దగా మార్పు ఉండే అవకాశం లేదన్నాడు. తాము ఇంకా మూడు మ్యాచ్‌లు గెలవాలని, ఒక్కో మ్యాచ్ గెలిచి, ఆ తర్వాత ఏం జరుగుతుందో చూడాలన్నాడు. గత ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు గెలవడం సంతోషంగా ఉందని, తమ జట్టు కాంబినేషన్ కూడా సెట్ అయ్యిందన్నాడు. ఏది ఏమైనా బ్యాటింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి, బౌలింగ్ సత్తా చాటే ప్రయత్నం చేస్తామని తెలిపాడు. వరుణ్ చక్రవర్తీ జట్టులోకి తిరిగి వచ్చాడని చెప్పాడు.



# కోహ్లీ, ధోనీ సరసన సునీల్ నరైన్..

ధనాధన్ లీగ్‌లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్ నరైన్ కెరీర్‌లో ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోనుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున అతడికి ఇది 200వ ఐపీఎల్ మ్యాచ్. లీగ్ చరిత్రలో ఒకే జట్టు తరఫున ఈ మైలురాయిని అందుకున్న నలుగురు అగ్రశ్రేణి ఆటగాళ్ల జాబితాలోకి నరైన్ చేరిపోయాడు. నిలకడకు, జట్టుపై ఉన్న విధేయతకు ప్రతీకగా నిలిచిన ఆటగాళ్లు మాత్రమే ఈ ఘనత సాధించారు. 2008 తొలి సీజన్ నుంచి బెంగళూరు జట్టుతోనే ఉన్న విరాట్ కోహ్లీ ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఆ తర్వాత ధోనీ, రోహిత్ శర్మ వంటి భారతీయ క్రికెట్ దిగ్గజాలు ఉన్నారు. ఇప్పుడు వీరి సరసన ఓ విదేశీ ఆటగాడిగా నరైన్ నిలవడం అతడి అంకితభావానికి నిదర్శనం. సునీల్ నరైన్ కేవలం మ్యాచ్‌లు ఆడటమే కాదు, కోల్‌కతా జట్టుకు ఎన్నో అద్భుత విజయాలను అందించాడు. ఐపీఎల్ కెరీర్ మొత్తంలో అతడు ఇప్పటివరకు 203 వికెట్లు పడగొట్టాడు. ఇందులో కేవలం 19 పరుగులిచ్చి 5 వికెట్లు తీయడం అతడి అత్యుత్తమ ప్రదర్శన. బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తూ కేవలం 6.78 ఎకానమీతో బౌలింగ్ చేయడం నరైన్‌కే చెల్లింది. లోయర్ ఆర్డర్‌లో వచ్చి మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడే పించ్ హిట్టర్‌గానూ జట్టుకు ఎన్నో సేవలు అందించాడు. ప్రస్తుత సీజన్‌లోనూ నరైన్ తనదైన శైలిలో రాణిస్తున్నాడు. ఆడిన పది మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసినప్పటికీ, అతడి ఎకానమీ రేటు 6.64గా ఉండటం గమనార్హం. పరుగులు వరదలా పారుతున్న ఈ లీగ్‌లో ఇంత తక్కువ ఎకానమీతో బౌలింగ్ చేయడం విశేషం. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లతో జరిగిన మ్యాచ్‌లలో రెండేసి వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటర్ల జోరుకు అడ్డుకట్ట వేశాడు. వ్యక్తిగతంగా సునీల్ నరైన్ అద్భుత మైలురాయిని అందుకున్నప్పటికీ, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు పరిస్థితి మాత్రం ప్రస్తుతం అంత ఆశాజనకంగా లేదు. ప్లేఆఫ్స్ రేసులో ఆ జట్టు ఉనికి ఇప్పుడు చెదిరిపోయే స్థితికి చేరింది. బెంగళూరుతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఓడిపోవడంతో కేకేఆర్ అవకాశాలు క్లిష్టంగా మారాయి. సమీకరణాల ప్రకారం కోల్‌కతా జట్టు టోర్నీలో నిలవాలంటే ఇకపై ఆడబోయే మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారీ తేడాతో విజయం సాధించాలి. అంతటితో ఆగకుండా, మిగిలిన జట్ల గెలుపోటములు, నెట్ రన్ రేట్ వంటి ఎన్నో లెక్కలు కోల్‌కతాకు అనుకూలంగా రావాల్సి ఉంటుంది. మిగతా జట్లు మెరుగైన ఫామ్, రన్ రేట్‌తో దూసుకుపోతుండటంతో, ఈ సీజన్‌లో కోల్‌కతా ప్లేఆఫ్స్‌కు చేరడం దాదాపు అసాధ్యమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సమిష్టి ప్రదర్శన లేక జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించే ప్రమాదంలో ఉన్నప్పటికీ, సునీల్ నరైన్ సాధించిన ఈ మైలురాయి మాత్రం కేకేఆర్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఒకే జట్టును నమ్ముకుని, సుదీర్ఘ కాలం పాటు ఆ ఫ్రాంచైజీకి వెన్నుముకగా నిలవడం సామాన్యమైన విషయం కాదు. కోల్‌కతా అభిమానుల గుండెల్లో నరైన్ ఎప్పటికీ ఒక అజేయమైన 'మిస్టరీ కింగ్'గానే నిలిచిపోతాడు.

.........



Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999